

అధికారాలేవి...

- అసంతృప్తిలో ఎంఇఒ-2 లు
- నాన్ అకాడమిక్ పనులు మాత్రమే అప్పగింత
- ఇద్దరు ఎంఇఒలకు సమాన అధికారాలు కల్పించాలి
- ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పాఠశాలల్లో దాదాపుగా 10 సంవత్సరాలకు పైగా ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు నిర్వహించిన మండల ఎంఇఒ-2 పోస్టులు ఇచ్చిన విద్యాశాఖ ఎలాంటి అధికారాలను కట్టబెట్టలేదు. ఇటీవల మండల విద్యాశాఖ అధికారులకు విడుదల చేసిన జాబు చార్ట్ పై ఎంఇఒ- 2లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఇద్దరి ఎంఇఒలకు సమాన అధికారాలు కల్పించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందు విద్యాశాఖ మండల విద్యాశాఖ అధికారికి అదనంగా మరో పోస్టును ఏర్పాటు చేస్తూ ఎంఇఒ-2 నియమించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 55 మంది సీనియర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు పదోన్నతులు కల్పించారు. కర్నూలు జిల్లాలో 26 మంది పదోన్నతి పొందారు. ఈ పోస్టును ఎంపిక చేసేటప్పుడు రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు ఎలాంటి అధికారాలను ఇవ్వాలనే నియామక ఉత్తర్వులు లేకుండానే పోస్టింగులు ఇచ్చారు. అక్టోబర్ నెలలో రాష్ట్ర ప్రభుత్వం మండల విద్యాశాఖ అధికారి 1 , మండల విద్యాశాఖ అధికారి 2 లకు సంబంధించిన అధికారాల విభజనపై ఉత్తర్వులను జారీ చేసింది. ఉత్తర్వుల ప్రకారం మండల విద్యాశాఖ అధికారి 1 పాఠశాలల పర్యవేక్షణతో పాటు ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు ఉపాధ్యాయులకు సంబంధించిన జీతాల చెల్లింపు ఇతర అంశాలు అన్ని వారికి కట్టబెట్టారు. ఎంఇఒ- 2కు నాడు నేడు పనులు చైల్డ్ ఇన్ఫో, అమ్మ ఒడి ఇతర అంశాలకు సంబంధించి పనులను అప్పగిస్తూ ఉత్తరులను జారీ చేశారు. ఈ ఉత్తర్వుల పట్ల అనేకమంది రెండో మండల విద్యాశాఖ అధికారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అనేక సంవత్సరాల పాటు అకాడమిక్‌లో పనిచేసి ఇప్పుడు కేవలం నాన్ అకాడమిక్ పనులను అప్పగించడం సమంజసం కాదని, విద్యాశాఖ తీరుపై మండిపడుతున్నారు. ఇద్దరూ మండల విద్యాశాఖ అధికారులకు అధికారాల కల్పనలో విద్యాశాఖ ఉన్నతాధికారులు అటు ఉపాధ్యాయ సంఘాల నుండి విద్యావేత్తల నుండి ఎలాంటి అభిప్రాయ సేకరణ తీసుకోకుండానే ఉత్తర్వులను జారీ చేసింది. ఇప్పుడు తాము మండల విద్యాశాఖ అధికారులుగా కొనసాగే కంటే పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా కొనసాగితేనే బావుంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి అధికారాలు లేనటువంటి ఈ పోస్టు ఎందుకని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే జారీ చేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకొని కొత్త నియమ నిబంధనలను రూపొందించి సమాన అధికారాలను కల్పించాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

ఎంఇఒ-2 కేవలం నామమాత్రపోస్టు

- జయరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి యుటిఎఫ్



రాష్ట్ర ప్రభుత్వం మండల విద్యాశాఖ అధికారుల పని విభజనలో ఏకపక్షంగా వ్యవహరించింది. ఎంఇఒ-2 పోస్టును ఏర్పాటు చేసినా ఎలాంటి అధికారాలను కట్టబెట్టకపోవడం దుర్మార్గం. నామమాత్రంగానే ఈ పోస్టులో ఎంఇఒ-2 లు పనిచేయాల్సి ఉంటుంది. ఇద్దరి ఎంఇఒలకు సమాన అధికారాలు ఇవ్వాలి.

సగం పాఠశాలలు ఎంఇఒ- 2 లకు అప్పగించాలి

- గోకారి, జిల్లా అధ్యక్షుడు ఎస్‌టియు



మండలంలోని పాఠశాలల్లో సగం పాఠశాలలు మొదటి మండల విద్యాశాఖ అధికారికి సగం పాఠశాలలు రెండవ మండల విద్యాశాఖ అధికారి పర్యవేక్షణకు చర్యలు తీసుకోవాలి. ఇద్దరికీ సమాన అధికారాలు కల్పిస్తేనే ఈ పోస్టులకు న్యాయం జరుగుతుంది.

డిడిఒ అధికారాలు కల్పించాలి

- జి.ఓంకార్ యాదవ్ ఎంఇఒ-2 ఓర్వకల్



రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల ప్రధానోపాధ్యాయులకు మండల విద్యాశాఖ అధికారి2 లుగా పదోన్నతులు కల్పించింది. అయితే ఇలాంటి అధికారాలు కల్పించకుండా కేవలం నాన్ అకాడమిక్ పనులను మాత్రం పర్యవేక్షించాలని చెప్పడం సరైనది కాదు. ఎంఇఒ జాబ్ చార్ట్ కు సంబంధించిన ఉత్తర్వులను సవరించి ఇరువురికి సమాన అధికారాలు ఉండేలా చూడాలి.

కర్నూలులో డిసెంబర్ 15 నుంచి ఎఐకెఎస్ సమావేశం

ఆహ్వాన సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా తిక్కారెడ్డి, ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న కె.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు జిల్లా కేంద్రంలో డిసెంబర్ 15,16,17 తేదీల్లో నిర్వహించే అఖిలభారత కిసాన్ సభ జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి పిలుపు నిచ్చారు. ఆదివారం కర్నూలు ఎంపిపి సమావేశ మందిరంలో అఖిల భారత కిసాన్‌సభ సన్నాహక సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆహ్వాన సంఘం అధ్యక్షులుగా టిడిపి మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్యాలకుర్తి తిక్కారెడ్డి, ఛైర్మన్‌గా నాగలక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, కోశాధికారిగా జి.రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా ఎం.ఎ.గఫూర్, అర్జా రామకృష్ణ, మరో వంద మందితో కమిటీని ఎన్నుకున్నారు. **(పూర్తి వివరాలు జనరల్ పేజీలో)**

కార్గోతో ఆర్‌టిసికి ఆదాయం

అక్టోబర్ 26 నుంచి నవంబర్ 24 వరకు మాసోత్సవాలు - అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ దానమ్మ తో ప్రజాశక్తి ముఖాముఖి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



ఎపిఎస్‌ఆర్‌టిసిలో కార్గో ఆదాయం సమకూర్చడంలో పరుగులు తీస్తోంది. ప్రజలతో మమేకమై రాత్రనగా పగలనకా ప్రజాసేవలో నిమగ్నమైన ఆర్‌టిసిని ప్రతి ఒక్కరూ తమ సొంత సంస్థగా భావిస్తారు. భద్రతకు పెద్దపీట వేసి ప్రజలకు అందుబాటు ధరలతో రవాణా సౌకర్యం కల్పిస్తున్న ఆర్‌టిసి అంటే ప్రజలకు ఎనలేని అభిమానం. ఇన్నాళ్లు ప్రజా రవాణాలో అగ్రగామి అయినా ఎపిఎస్‌ఆర్‌టిసి సరుకు రవాణా ప్రారంభిం చింది. పార్సిల్ , కొరియర్ సేవలతో రాష్ట్రంలో ప్రజాధరణ పొందుతోంది. సంస్థ ఏ పథకం ప్రవేశపెట్టినా ప్రజలు గొప్పగా ఆదరించారు. ప్రజా రవాణాతో పాటు సరుకులు, పార్శిళ్లు రవాణా చేస్తూ అదనపు ఆదాయాన్ని సమకూర్చడంలో కార్గో ప్రధాన భూమిక పోషిస్తోంది. ఇందులో కండక్టర్లు, డ్రైవర్లు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు.' అని కార్గో కమర్షియల్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్(ఎటిఎం) పి.దానమ్మ తెలిపారు.

కార్గో మాసోత్సవాల సందర్భంగా ఆమెతో ఈవారం ప్రజాశక్తి ముఖామఖి....

కార్గో ఎప్పుడు ప్రారంభించారు? ఎంత ఆదాయం వస్తుంది.?

ఎటిఎం: 2017 ఆగస్టులో ఎఎన్ఎల్ నుండి కార్గోగా మారింది. నాడు రూ.10 కోట్ల ఆదాయం నుండి ఈ ఆర్థిక సంవత్సరం 2023- 24 నాటికి రూ.169 కోట్లకు చేరుకుంది.

కార్గో మాసోత్సవాల సందర్భంగా ఎంత టార్గెట్ నిర్ణయించుకున్నారు?

ఎటిఎం: కార్గోమాసోత్సవాలు అక్టోబర్ 26 నుండి నవంబర్25 వరకు నిర్వహిస్తున్నాం. ఈ సందర్భంగా అన్ని డిపోలలో ప్రచారం నిర్వహిస్తూ ఒక ఉద్యోగి నాలుగు పార్సళ్లు బుక్ చేసి వాటిని చేరవేసే బాధ్యతను టార్గెట్‌గా తీసుకున్నాం. రోజుకు సగటున 24,200 బుకింగ్స్ రూ.50.36 లక్షల ఆదాయం వస్తుంది.

కార్గో ఎన్ని డిపోలలో ఏజెన్సీలు ఉన్నాయి?

ఎటిఎం: ప్రస్తుతం జిల్లాలో ఆదోని, కర్నూలు డిపోలలో కార్గో ఏజెన్సీలు ఉన్నాయి. అన్ని డిపోలకు కార్గోను విస్తరిస్తాం.

కర్నూలు జిల్లా నుండి పార్లళ్లు ఎన్ని గంటల లోపల వినియోగదారులకు కార్గో ద్వారా చేరుస్తున్నారు?

ఎటిఎం: ప్రధాన నగరాలైన విజయవాడ, గుంటూరు, ఏలూరు, రాజమహేంద్రవరం, విశాఖ పట్నం, విజయనగరం, అనంతపురం, కడప, చిత్తూరు, ఒంగోలు, నెల్లూరు లాంటి ప్రధాన పట్టణాలకు డోర్ డెలివరీ సౌకర్యం ఉంది. ఇది 2021 నుంచి ప్రారంభమైంది. రాష్ట్రంలో ఎక్కడికైనా ప్రతి మాసం ఐదు లక్షల పైబడి పార్శళ్లను బక్ చేసిన తరువాత దాదాపు 24 గంటలలోపు డోర్ డెలివరి చేరుస్తున్నాం.

ఎన్ని కేజీల వరకు పార్లళ్లను డోర్ డెలివరీ చేస్తున్నారు?

ఎటిఎం: 50 కేజీలవరకు బరువు గల పార్శళ్లను పది కిలోమీటర్ల లోపు వినియోగదారులు బుక్ చేసినప్పుడు బుకింగ్ చార్జీలతో పాటు డోర్ డెలివరీ చార్జీలు కూడా చెల్లించి పార్సిల్ పొందువారి చిరునామా ఫోన్ నెంబర్ పిన్‌కోడ్ డోర్ నెంబర్ల వివరాలను తెలియజేసి డోర్ డెలివరీ సదుపాయం పొందవచ్చు. నిర్ణయించిన చార్జీల ద్వారా వస్తువులను చేరవేస్తున్నాం.

ఆర్‌టిసి ఆదాయ వనరులు ఏవి?

ఎటిఎం: ఆర్‌టిసిలో మూడు రకాల ఆదాయ వనరులు ఉంటాయి. ప్రయాణికుల టికెట్లు చెల్లించడం ద్వారా, ఆర్‌టిసి స్థలాలు వ్యాపారాల అద్దెకు ఇచ్చుట ద్వారా, సరుకులు రవాణా (కార్గో) ద్వారా , ఆదాయం సమకూరుతుంది. సరుకుల రవాణా పర్యవేక్షించేందుకు 2017 నుండి ప్రతి జిల్లాకు ప్రత్యేకంగా డిపో మేనేజర్ స్థాయిలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్)ను నియమించారు.

బల్క్ గా వస్తువులు, సరుకులు రవాణా కు ఏమైనా చర్యలు చేపట్టారా?

ఎంటిఎం: బల్క్‌గా వస్తువుల రవాణా చేపట్టుటకు సంస్థ ప్రత్యేకంగా కంటైనర్ బస్సులను తయారు చేయించింది.

ఎన్ని కేజీల వరకు ఎన్ని కిలోమీటర్ల పరిధిలో పార్సళ్లను డోర్ డెలివరీ చేస్తున్నారు?

ఎటిఎం: 50 కేజీల వరకు పది కిలోమీటర్ల పరిధిలో రాష్ట్రంలో ఎంపిక చేసిన 84 పట్టణాల్లో అమలు చేస్తున్నాం.

పార్సిళ్లస్థితిగతులను తెలుసుకునేందుకు ఎలాంటి చర్యలు చేపట్టారు? డోర్ **డెలివరీ ప్రత్యేకతలు ఏమిటి?**

ఎటిఎం: లైఫ్ ట్రాకింగ్ ద్వారా పార్సెల్ స్థితిగతులను తెలుసుకునే వెసులుబాటు ఉంది. యుపిఐ పేమెంట్ ద్వారా నగదు చెల్లించే సదుపాయ ఉంది. రాష్ట్రంలో ఏ ప్రాంతానికైనా గరిష్టంగా 24 గంటలలో సత్వరం బట్వాడా జరుగుతుంది.

భవిష్యత్తు ప్రణాళిక ఏమిటి?

ఎటిఎం: ఆటోమేటిక్ వేయింగ్ మిషన్ల ద్వారా సరుకు కచ్చితంగా తూచడం. అత్యాధునిక సాఫ్ట్‌వేర్ ద్వారా సరుకు రవాణాలో ముందంజలో ఉన్నాం. కండక్టర్లు, డ్రైవర్ల సహకారంతో సరుకులు రవాణాను గ్రామాలకు విస్తరించడం ప్రధాన లక్ష్యం. ఆర్‌టిసి అంటే భద్రత, బాధ్యత, సురక్షిత, వేగవంతమైన రవాణా ప్రయాణికుల ఆదరాభిమానాలతో సరుకు రవాణాలో మరింత మెరుగైన సేవలను అందిస్తాం.అదనపు సమాచారం కోసం ఎటిఎం కమర్షియల్ కర్నూలు 7331147270, రీజనల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కర్నూల్ 9491829293 నెంబర్లకు సంప్రదించాలి.



అవినీతి రహిత దేశం కోసం పాటుపడదాం

- ఆర్‌విఇఒ నీలం పూజిత - ముగిసిన విజిలెన్స్ వారోత్సవాలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఆర్‌విఇఒ

అవినీతి రహిత భారత దేశం కోసం ప్రతి ఒక్కరం పాటుపడదామని కర్నూలు జిల్లా ఆర్‌విఇఒ నీలం పూజిత అన్నారు. విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్సుమెంట్ అవగాహన వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. అందులో భాగంగా అవినీతి రహిత భారత దేశం అనే అంశంపై ఇదివరకు విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆమె కర్నూలు సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నేటి విద్యార్థులు భావిభారత పౌరులని అన్నారు. దేశ భవిష్యత్తు విద్యార్థులపైనే ఆధారపడి ఉందన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే అవినీతిని అంతమొందించాలన్నారు. ప్రతి పౌరుడు తన చుట్టూ ఏమి జరుగుతుందన్న అంశాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ గుర్తించాలన్నారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ గురించి ఆమె విద్యార్థులకు వివరించారు. ప్రభుత్వ శాఖల్లో ఎలాంటి తప్పులు జరుగుతున్నట్లు గుర్తించినా తమకు తెలియజేయాలన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బాధ్యతాయుతంగా విధులను నిర్వర్తించాలన్నారు. అవినీతికి పాల్పడకుండా ప్రభుత్వ సేవలను ప్రజలకు ఉచితంగా అందించాలన్నారు. అవినీతి రహిత భారతాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ చేయిచేయి కలపాలన్నారు. సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ శౌరీల్‌రెడ్డి, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ సిఐలు కేశవరెడ్డి నాగరాజు యాదవ్ పూల రామకృష్ణ సునీల్ కుమార్ ఎఒ రోఫస్, బి.చంద్రశేఖర్ రెడ్డి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను పట్టించుకోని వైసిపి ప్రభుత్వం


తుగ్గలిని కరువు మండలంగా ప్రకటించాలి : మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-తుగ్గలి



పంటలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి సోమిరెడ్డి , టిడిపి నాయకులు

రైతులను పట్టించుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలం పరిధిలోని జొన్నగిరి గ్రామంలో రైతుల పొలాలను పత్తికొండ టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి శ్యాంబాబు ఆధ్వర్యంలో వారు పరిశీలించారు. మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో రాక్షస పాలనను కొనసాగిస్తున్నారన్నారు. వర్షాలు పడక, పంటలు పండక, పొలాలు ఎండిపోతున్నప్పటికీ తుగ్గలి మండలాన్ని కరువు మండలంగా ఎందుకు ప్రకటించారో అని ఆయన ప్రభుత్వంపై మండిపడ్డారు. రైతుల పక్షపాతి అని చెబుతున్న వైసిపి ప్రభుత్వం రైతులను నట్టేట ముంచే ప్రయత్నం చేస్తుందని ఆయన తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఇలాగే కొనసాగితే రైతుల సైతం సుదూర ప్రాంతాలకు వలసల వెళ్ళక తప్పడం లేదన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో వైసిపి పాలనపై అన్ని వర్గాల ప్రజలు విసుగెత్తి పోతున్నారని ఆయన తన ఆందోళన వ్యక్తం చేశారు. ఏది ఏమైనప్పటికీ 2024 లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఈ ప్రమాణం చేస్తారని ఆయన తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్యాంబాబు, మాజీ జడ్‌పి ఛైర్మన్ బత్తిన వెంకటరాముడు, టిడిపి మండల కమిటి అధ్యక్షులు తిరుపాలనాయుడు, స్థానిక నాయకులు బాలన్న, సర్పంచి ఓబులేసు, త్రిమూర్తులు, కృష్ణ వివిధ గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు : హాఫీజ్‌ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : సంక్షేమ పథకాల అమలుతో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజానీకానికి ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి మంచి చేశారని కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ హాఫీజ్ ఖాన్ అన్నారు. ఆదివారం 44వ వార్డ్ 115సచివాలయం వెంకటరమణ కాలనీ, వీనస్ కాలనీ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కార్పొరేటర్ రాజరాజేశ్వర్ రెడ్డి తో కలిసి నిర్వహించారు. ఆయన వార్డులోని ప్రతి కుటుంబాన్ని పలకరిస్తూ ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగన్ అన్న, జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష, జగనన్న ఆరోగ్య సురక్ష ఇలాంటి ఎన్నో పథకాలలు ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. జగనన్న ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి అందేలా చూడాలని సంబంధిత సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఎమ్మెల్యే తన దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే అధికారులకు అక్కడిక్కడే ఫోన్ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. గోశాల చైర్మన్ ఆదిమోహన్ రెడ్డి, వైసీపీ నాయకులు కరుణాకర్ రెడ్డి, ఖాజా, రాముయాదవ్, జంగిల్లమ్మ సంబందిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం, క్రమశిక్షణ

కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలను ప్రారంభించిన డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



బెల్టులు సాధించిన క్రీడాకారులతో డాక్టర్ శంకర్‌శర్మ , కోచ్‌లు

క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులు క్రమశిక్షణ గల పౌరులుగా, ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ తెలిపారు. కర్నూలు ఎన్ఆర్‌పేట శ్రీలక్ష్మీ హైస్కూల్ ప్రాంగణంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కరాటే శిక్షకుడు రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు. కరాటేలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సీనియర్ డాక్టర్ శంకర్ శర్మ బెల్టులను ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడి చదువులోనూ రాణిస్తారని చెప్పారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో విద్యార్థులు సెల్ ఫోన్లు, కంప్యూటర్లు వంటి వాటికి అలవాటు పడి ఎలాంటి శారీరక వ్యాయామం లేకపోవడం వల్ల ఊబకాయం వంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. చిన్న వయసులోనే ఊబకాయం వల్ల రక్తపోటు, మధుమేహం, ఫ్యాటీ లివర్ వంటి సమస్యలు వచ్చి ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్ సాధన చేయడం వల్ల విద్యార్థులు ఆత్మ రక్షణతో పాటు ఇతరులను రక్షించే అవకాశం ఉంటుందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఏ దేశ ప్రగతి అయినా తరగతి గదుల్లోనే తయారు అవుతుందని చెప్పారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి జీవితంలో ఎవరయ్యే ఆటుపోట్లను ఎదుర్కొనే అవకాశం ఉంటుందని చెప్పారు. కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్‌లో బాలికలు సాధన చేయడం వల్ల వారి ఆత్మ రక్షణ చేసుకోవడం సాధ్యమవుతుందని చెప్పారు. క్రీడల్లో బాలికల భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉందని, తద్వారా మహిళా సాధికారత సాధ్యమవుతుందని అన్నారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల క్రమశిక్షణ, అంకిత భావం పెరిగి చెడు అలవాట్లకు దూరంగా ఉత్తమ పౌరులుగా సమాజంలో గుర్తింపు పొందుతారని సూచించారు. కర్నూలు నగరంలో క్రీడలను ప్రోత్సహించేందుకు తాను ఎప్పుడూ ముందుంటానని, తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలని సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ సూచించారు.



పోలీస్ ఔట్ పోస్టును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

శరీన్‌నగర్‌లో పోలీస్ ఔట్ పోస్టు ప్రారంభం

ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు అర్బన్ షరీన్‌నగర్‌లో ఏర్పాటు చేసిన పోలీస్ ఔట్ పోస్టును పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ ప్రాంత సమస్యల పరిష్కారానికి ఔట్ పోస్టు ఉపయోగపడుతుందన్నారు. కార్పొరేటర్లు కాశపోగు జయరాముడు, సంగాల సుదర్శన్ రెడ్డి, వైసిపి నాయకులు శివారెడ్డి, హేమలత, నాలుగవ పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్, పలువురు కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కల్లూరు అర్బన్ 32 వ వార్డులోని కల్లూరు ఎస్టేట్" లో కల్లూరు స్కిన్ మైండ్ కేర్ క్లినిక్' ను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ సాన శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా ఎపిడబ్ల్యుజెఎఫ్ వార్షికోత్సవం



డిపిఆర్‌ఒ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మేయర్ బివై రామయ్య, ఎపిడబ్ల్యుజెఎఫ్ నేతలు

కేక్ కట్ చేసిన మేయర్ , ఎపిడబ్ల్యుజెఎఫ్ నేతలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ 16వ వార్షికోత్సవ వేడుకలు కలెక్టరేట్‌లో ఆదివారం నిర్వహించారు. కర్నూలు సమాచారం కార్యాలయంలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా నగర మేయర్ బివై రామయ్య కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కల సాకారం అవుతుందని అన్నారు. ఏళ్ల నాటి కోరిక నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డికి దక్కుతుందని అన్నారు. జర్నలిస్టులకు 3 సెంట్ల స్థలంలో ఇంటిని కూడా నిర్మాణం చేసేలా ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటారని, సంక్రాంతి కానుకగా జర్నలిస్టులకు అందిస్తారని అన్నారు. మేయర్‌తోపాటు ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మట్టిలేటి, జిల్లా కార్యదర్శి బి గోరంట్లప్ప, ఫోటో గ్రాఫర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.హుస్సేన్ ,జిల్లా అధ్యక్షులు సుబ్రమణ్యంలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులకు 3 సెంట్ల స్థలాన్ని కేటాయిస్తూ కేబినెట్‌లో నిర్ణయించడం శుభపరిణామం అన్నారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడుబసప్ప, నగరఅధ్యక్ష కార్యదర్శులు శివ కుమార్, నాగేంద్ర, సీనియర్ జర్నలిస్టులు ప్రజాశక్తి ఎడిషన్ ఇంచార్జ్ పానుగంటి చంద్రయ్య, ఎన్‌టివి చంద్రశేఖర్, సాక్షి టివి లోకేష్, ఫోటో గ్రాఫర్ జిల్లా నాయకులు వడ్డే శ్రీనివాసులు, జిల్లా నాయకులు డి.చంద్ర మోహన్, యూసఫ్ ఖాన్, ఎపిడబ్ల్యుజెఫ్ నగర ఉపాధ్యక్షులు విద్య సాగర్, రమేష్, సహాయ కార్యదర్శులు సునీల్ కుమార్, శ్రీరాములు జిల్లా నాయకులు సాక్షి శివ, జమ్మన్న, కుమార్, అనిల్, ఫోటో గ్రాఫర్స్ నాయకులు కుమార్, సుధాకర్, ఆంజనేయులు, రాము, శేఖర్, మధు, పక్కీరప్ప,తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇస్తామన్న ముఖ్యమంత్రికి జర్నలిస్టుల కృతజ్ఞతలు

వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి

కల్లూరులో ఎపిడబ్ల్యుజెఎఫ్ 16వ వార్షికోత్సవం



కల్లూరు ఎపిడబ్ల్యుజెఎఫ్ కార్యాలయంలో కేట్ కట్ చేస్తున్న జర్నలిస్టులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : అక్రిడిటేషన్ పరిగణలోకి తీసుకోకుండా ప్రతి జర్నలిస్టుకు 3 సెంట్లు ఇళ్ల స్థలంతో పాటు, నిర్మించి ఇవ్వాలని ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు పానుగంటి చంద్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ కల్లూరు మండల కమిటీ ఉపాధ్యక్షులు నాగేంద్ర, కార్యదర్శి పరమేష్ ఆధ్వర్యంలో కల్లూరు కార్యాలయంలో 16వ వార్షికోత్సవం, కల్లూరు మండలం కమిటీ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు పానుగంటి చంద్రయ్య, జిల్లా నాయకులు యూసుఫ్‌ఖాన్, పాణ్యం నియోజకవర్గం కార్యదర్శి నీలం సత్యనారాయణ, ఉపాధ్యక్షులు వి.విజయ్ కుమార్, నాగరాజు, కల్లూరు సహాయ కార్యదర్శి మధు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. చంద్రయ్య మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టులకు 3 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన నిర్ణమాన్ని స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే అక్రిడిటేషన్ పరిగణలోకి తీసుకుంటే జర్నలిస్టలకు పూర్తిస్థాయిలో నష్టం జరిగే ప్రమాదం ఉందని అన్నారు. కరోనా కాలం నుండి కేంద్ర ప్రభుత్వం రైలు ప్రయాణంలో జర్నలిస్టులకు రాయితీ నిలిపివేసిందని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపించి రైల్వేలో రాయితీకి కృషి చేయాలని కోరారు. ఉపాధ్యక్షులు నాగేంద్ర మాట్లాడుతూ జర్నలిస్టల సమస్యల పరి ష్కారానికి ఎపిడబ్ల్యూజెఎఫ్ చిత్తశుద్ధితో అనేక పోరాటాలు సాగించిందన్నారు. పోరాటాల ద్వారా అక్రిడిటేషన్, జర్నలిస్టుల పిల్లలకు రాయితీ సాధించినట్లు చెప్పారు. ఎపిడబ్ల్యూజెఎఫ్ నిర్వహించే పోరాటాల్లో జర్నలిస్టలందరూ భాగస్వాములు కావాలని కోరారు. కల్లూరు మండలం కమిటీ నాయకులు జేమ్స్, గంగాధర్, శేఖర్, మధు, జనార్దన్,తదితరులు పాల్గొన్నారు.


మీనాక్షి నాయుడుని ఘజమాలతో సన్మానం చేస్తున్న నాయకులు

టిడిపితోనే అభివృద్ధి, సంక్షేమం

ప్రజాశక్తి - ఆదోని

అభివృద్ధి, సంక్షేమం రెండూ టీడీపీతోనే సాధ్యమని ఆదోని నియోజక వర్గ ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు అన్నారు. ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా దిబ్బనకల్, సలకులకొండ గ్రామంలో ఇంటింటికి తిరిగి అధికారంలో వస్తే చేపట్టే పథకాలపై అవగాహన కల్పించారు. దొడ్డనగిరి గ్రామంలో సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు, పెద్ద తుంబలం, జలమంచి గ్రామంలో రంగస్వామి నాయుడు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మీనాక్షి నాయుడు మాట్లాడారు. ఎలాంటి తప్పు చేయని చంద్రబాబును కక్ష సాధింపు ధోరణితోనే సీఎం జగన్ జైల్లో పెట్టించారన్నారు. బాబుకు ప్రజల్లో సానుభూతి పెరిగిందన్నారు బాబు సారథ్యంలో వచ్చే ఎన్నికల్లో టిడిపి గెలవడం ఖాయమని సీఎంగా చంద్రబాబు మేనిఫెస్టో లో పేర్కొన్న అంశాలను అమలు చేస్తారన్నారు అంతకుముందు వారికి గ్రామ నాయకులు తప్పెట్లు తాళాలతో ఘన స్వాగతం పలికారు ఈ కార్యక్రమంలో నాయకులు, క్లస్టర్ యూనిట్ సభ్యులు రామస్వామి, బుద్ధారెడ్డి, రంగన్న, రామకష్ణ, లక్ష్మన్న, వలమన్న, ప్రతాప్ రెడ్డి, హనవాళ్ళు మాబాష, సోము, శివప్ప, గోవిందప్ప, నాగరాజు, షరీఫ్, అన్వర్ బాష, బంగారయ్య, అయ్యన్న శివప్ప, సలకల కొండ ప్రతాపరెడ్డి ఉన్నారు.

రైతు గర్జన ర్యాలీని జయప్రదం చేయండి


మాట్లాడుతున్న మహేంద్ర నాయుడు

ప్రజాశక్తి- దేవనకొండ

ఉమ్మడి జిల్లాల కాంగ్రెస్ అధ్యక్షులు లక్ష్మి నరసింహ యాదవ్ ఆధ్వర్యములో ఈనెల 7 తేదీన కర్నూల్ నగరంలో రాజ్ విహార్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు జరగబోయే రైతు గర్జన ర్యాలీకి ఆలూరు నియోజక వర్గం నుంచి నాయకులకు, కార్యకర్తలు,ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మహేంద్ర నాయుడు కోరారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో కరవు విలయతాండవం చేస్తుందన్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు పండక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. ప్రభుత్వం కరువు నియంత్రణ చర్యలు చేపట్టి,2 లక్షల వరకు రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిడబ్ల్యూసి మెంబర్ రఘువీరా రెడ్డి, ఎపి పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు,ఇన్చార్జి ఎసిసి సెక్రెటరీ మాయప్పన్, మాజీ రాజ్యసభ సభ్యులు మీడియా చైర్మెన్ తులసి రెడ్డి, ఎపి వర్కింగ్ ప్రెసిడెంట్, ఉమ్మడి జిల్లాల ఇంచార్జ్ మస్తాన్వలి పాల్గొంటున్నట్లు తెలిపారు. సమవేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాసులు, ఖాసీం,నియోజకవర్గ సహయ కార్యదర్శి నాగార్జున ,యశ్వంత్,రాజు పాల్గొన్నారు.

సౌత్ జోన్ పోటీలకు ఆదోని విద్యార్థి

ప్రజాశక్తి - ఆదోని

ఇటీవల కర్నూలు కెవి సుబ్బా రెడ్డి కాలేజీ మైదానంలో జరిగిన రాయలసీమ యూనివర్సిటీ కబడ్డీ పోటీల్లో ఆదోని ఆర్ట్స్ కాలేజీకి చెందిన విద్యార్థి బి రాజు ప్రతిభ చాటి సౌత్ జోన్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల యాజమాన్యం దైవదీనం రెడ్డి, విట్టా సతీష్, ప్రిన్సిపల్ మురళీ మోహన్ రెడ్డి తెలిపారు. ఆదివారం కాలేజీలో జరిగిన అభినందన సభలో వారు మాట్లా డారు. ఈనెల 9న కాకినాడలో జరిగే సౌత్ జోన్ కబడ్డీ పోటీల్లో పాల్గొం టారని తెలిపారు.ఎంపికైన విద్యార్థి బి రాజును, తర్ఫీదు ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ ఎర్రిస్వామిలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా కబడ్డీ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ అమర్ ప్రకాష్ పాల్గొన్నారు.


ట్రోఫీతో విద్యార్థి

తీరని ట్రాఫిక్ సమస్య

- తప్పని ఇబ్బందులు...



ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో రోజురోజుకు రోడ్లు ఇరుకుగా మారుతున్నాయి. వాహనాలు ఉపయోగించే వారి సంఖ్య పెరగడంతో దార్లన్నీ రద్దీ అవుతున్నాయి. పట్టణంలోని మున్సిపల్ రోడ్డు, పండిట్ నెహ్రూ రోడ్డు, గీతా మార్కెట్ ప్రాంతాలు ఎప్పుడూ రద్దీగా ఉంటున్నాయి. దుకాణాల ముందు వాహనాలు నిలుపుకునేందుకు ఫుట్ పాత్ సదుపాయం లేదు. జనం రద్దీగా ఉంటున్న ఈ రోడ్లలో రాకపోకలు తలనొప్పిగా ఉందని వాహనదారులు చెబుతున్నారు. శ్రీనివాస భవన్, బాబా ప్లాజా, పెద్ద మసీదు, పెద్ద మార్కెట్, దాదా కూల్ డ్రింక్ షాపు, జిబి కాంప్లెక్స్ ప్రాంతాల్లో ఎప్పుడూ వాహనాలు అడ్డదిడ్డంగా నిలవడం వల్ల బైక్ వెళ్లేందుకు కూడా అవకాశం లేని పరిస్థితి ఉందని పలువురు చెబుతున్నారు.

వన్ వే మరిచారు: పట్టణంలోని మంగళ క్లాత్ స్టోర్ నుంచి షరాఫ్ బజార్ వరకు, శ్రీనివాస భవన్ నుంచి వన్ టౌన్ పోలీసు స్టేషన్ వరకు గతంలో వన్‌వే అమలులో ఉండేది. ప్రస్తుతం ట్రాఫిక్ పోలీసులు నిబంధనలను గాలికి వదిలేయడంతో రోడ్డు ఎప్పుడూ వాహనాలతో రద్దీగా ఉంటుంది. బళ్లారి, రాయచూరు, సిరుగుప్ప ప్రాంతాలకు వెళ్లే భారీ వాహనాలు శ్రీనివాస్ భవన్ రోడ్డు గుండానే కొత్త బ్రిడ్జి మీదుగా వెళ్లాల్సి ఉంది. భారీ వాహనాలు వచ్చినప్పుడు శ్రీనివాస్ భవన్ రోడ్డు ఇరుకుగా ఏర్పడి గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోతున్న పరిస్థితి ఉంది. అధికారులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని పురవాసులు కోరుతున్నారు.

నెరవేరని సీఎం హామీ

గతేడాది జులై మాసంలో ముఖ్యమంత్రి జగన్ పర్యటన సందర్భంగా ఇచ్చిన హామీ నెరవేరలేదని పురవాసులు చెబుతున్నారు. ఆదోనిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు రోడ్ల ఆధునీకరిస్తామని ప్రకటించారు. పట్టణం వీధులు విస్తరిస్తాయని అందరూ భావించారు. అక్రమ కట్టడాలు, రోడ్ల కోసం రూ.53 కోట్లు కేటాయిస్తామని బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రకటించారు. మున్సిపల్ రోడ్డు నుంచి గణేష్ సర్కిల్ వరకు, అక్కడి నుంచి పెద్ద మసీదు మీదుగా మున్సిపల్ రోడ్డు వరకు అక్రమ కట్టడాలు కూల్చాల్సి ఉంది. అధికారులు కొలతలు వేసి సుమారు 2.5 కిలోమీటర్లు రోడ్డు ఇరువైపులా తొలగించాలని, అందుకు కావాల్సిన నిధుల కోసం ప్రభుత్వానికి నివేదించారు. ముఖ్యమంత్రి ప్రకటన కార్యరూపం దాల్చకపోవడంతో ప్రాధాన్యత కోల్పోతున్న పరిస్థితి ఉంది. ప్రభుత్వం ఆదోనిలో పండిట్ నెహ్రూ రోడ్డు, మున్సిపల్ రోడ్డు వెడల్పు చేసి ట్రాఫిక్ ససమ్య లేకుండా చూడాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

కరువును విస్మరించిన ప్రభుత్వం

టిడిపి నియోజకవర్గ ఇంచార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి


మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - మంత్రాలయం

రాష్ట్రంలో వైసిపి పాలకులు కాసుల కోసం కక్కుర్తి పడి కరువు కాటకాలను విస్మరించారని టిడిపి నియోజకవర్గ ఇంచార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి విమర్శించారు. ఆదివారం స్థానిక పంకజ ప్యారడైజ్ లాడ్జీ వద్ద మండల పరిధిలోని చిలుకలడోన గ్రామానికి చెందిన సుమారు 30 కుటుంబాలు వైసిపి నుండి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వేసిన పంటలు ఎండిపోయి పెట్టిన పెట్టుబడులు రాక కొందరు రైతులు ఆందోళన చెందుతున్నారని మరికొందరు రైతు కూలీలు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవేవీ పట్టించుకోకుండా వైసిపి ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శిం చారు. వైసిపి పాలనలో ప్రజలు విసిగిపోయారని చంద్రబాబు పాలనకు ఎదురు చూస్తున్నారని తెలిపారు. టిడిపి అధికారంలోకి రాగానే తాగునీటి వసతి ఇంటి స్థలాలు గృహ నిర్మాణాలు చేపట్టడంతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. పార్టీలో చేరిన వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. చిలుకలడోన గ్రామానికి చెందిన వైసిపి నాయకులు తిక్కయ్య ఆధ్వర్యంలో మండల నాయకులు ఎల్లారెడ్డి, మాజీ గ్రామ సర్పంచ్ హనుమంతు నేతృత్వంలో టిడిపిలోకి చేరారు. వారికి తిక్కారెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిం చారు. పార్టీలో చేరిన వారిలో దేవేంద్ర, వీరేష్ గౌడ్, భీమన్న, వీరేష్ గోవిందు బిపి రామకృష్ణ బిపి రవి ముద్దు రంగన్న, చిన్న పక్కీరప్ప నారాయణ, బసప్ప, ఐరన్ గల్లు నారాయణ, బసాపురం భీమేష్, జంగం శివుడు తదితరులు ఉన్నారు. టిడిపి మండల నాయకులు అశోక్ రెడ్డి, అమర్నా త్ రెడ్డి, హండే హనుమంతు, తిక్కస్వామి గౌడ్, వట్టేప్ప గారి నరసింహ, వనికె నాగరాజు, నరసింహ పాల్గొన్నారు.

దళితుల వ్యతిరేకి ఎపి సిఎం : టిడిపి

దళితులకు మేనమామగా ఉంటానని నమ్మించి దళితుల ఓట్లతో గద్దె నక్కిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దళితులపై దాడులు చేయిస్తున్నారని టిడిపి దళిత నాయకులు ఆరోపించారు. ఆదివారం ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి యోబు ఆధ్వర్యంలో స్థానిక రాఘవేంద్ర సర్కిల్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి విజయ్ కుమార్, ఐటిడిపి అధ్యక్షులు సాల్మన్ రాజు, కోసిగి ఎంపిటిసి సభ్యులు రాజు దావీదు రాజబాబు దొడ్డి బెళగల్ గ్రామ సర్పంచ్ రామయ్యలు మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో దళితులపై దాడులు చేసిన వారికి, జగన్మోహన్ రెడ్డి అండగా ఉండడమే కాకుండా దళితులను ఆర్థికంగా దెబ్బ తీసే విధంగా ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు, ఎస్సీ కార్పొరేషన్ నిధులు ఒక్క రూపాయి అయినా నాలుగున్నర ఏళ్లలో ఖర్చు చేయలేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో తిక్కారెడ్డి నాయకత్వంలో దళితులంతా కలిసి వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి పంపించే బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని కోరారు. ఎన్నికల్లో నియోజకవర్గ టిడిపి అభ్యర్థి పాలకుర్తి తిక్కారెడ్డిని గెలిపించుకుందామని కోరారు. యస్‌సి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు ఎరిగేరి వీరేష్, దేవన్న,సాతూనూరు రాజు ,మారేష్, డీలర్ లింగమూర్తి, సూగురు సుజ్ఞాన్నాం, ఇశ్రాయేల్, చెట్నిపల్లి రవి, దేవదాస్, యోహాను ,ఆనంద్, బసవలింగ, రచ్చుమర్రి చిదానంద ,నాగన్న, గాబ్రీలు, డేవిడ్, ఈరన్న, అన్ని యస్ సి సెల్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

రక్తనాళాల వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని లయన్స్ క్లబ్, అవోపా, చిన్మయ మిషన్ సంయుక్తంగా కర్నూలు ఏషియన్ ఆసుపత్రి సౌజన్యంతో ఆదోనిలోని చిన్మయ కాంప్లెక్స్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిం దని లయన్స్ క్లబ్ అధినేత డాక్టర్ వై.గోపీనాథ్, జిల్లా అవోపా ఉపాధ్యక్షుడు వంగదారు శ్రీనాథ్ గుప్తా తెలిపారు. రక్తనాళాలకు సంబంధించిన వ్యాధులకు వైద్య పరీక్షలు 350 మంది రోగులకు చేశామన్నారు. దాదాపు 4500 రూపాయలు వరకు విలువైన రక్త పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ క్యాంపు ద్వారా ఎన్నో వ్యాధులకు పరిష్కారం దొరికిందన్నారు. చిన్మయి మిషన్ వేదికగా ఇలాంటి మంచి క్యాంపుకు తాము స్థల దాతగా ఉన్నందుకు ఆనందంగా ఉందని ఆదోని చిన్మయి మిషన్ కార్యదర్శి మేదేహాలు రఘునాథ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏషియన్ హాస్పిటల్ డాక్టర్లు నాని, ప్రమోద, లయన్స్ క్లబ్ అధ్యక్షులు ధర్మారెడ్డి, రీజియన్ చైర్మన్ ప్రసాదరావు, ఓం ప్రకాష్, నీలిమోహన్, మంజుల, వనపరాజు, అవోపా సభ్యులు సంగీత మమతా శ్రీ, బిందు కవితా శ్రీ, పద్మశ్రీ పాల్గొన్నారు.



విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- దేవనకొండ

ఈనెల 8న నిర్వహించే విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యూ.కారుమంచి కోరారు. ఆదివారం ఏఐవైఎఫ్ ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణకై, కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని బంద్‌ను జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో వైఎఫ్ మండల కార్యదర్శి రామాంజి,అధ్యక్షుడు రవికుమార్, ఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు రంగన్న, మండల నాయకులు రామంజి, బాషా, సురేంద్ర, మల్లి, వీరంజి, శ్రీను, అక్బర్, నరేష్,భాస్కర్ పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలకు చెక్

ప్రజాశక్తి - హాలహార్వి

రీ సర్వేతో రైతులు భూ సమస్యలు పరిష్కారం చేసుకోవచ్చని తహశీల్దార్ మల్లికార్జున స్వామి అన్నారు. ఆదివారం కులల్లి గ్రామంలో రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా తహశీ ల్దార్ మాట్లా డుతూ సర్వే పూర్తయితే తమ భూములు విషయంలో రైతులు ధైర్యంగా ఉండవచ్చున్నారు. అక్రమాలకు అవకాశం ఉండదని అన్నారు. సమ స్యలు శాశ్వత పరిష్కార కోసమే వైయస్సార్ జగనన్న ప్రభుత్వం శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకం కింద ఆధునిక డిజిటల్ రికార్డులు చేపట్టిందన్నారు. భూ రికార్డులు సరిగలేకపోతే ఎన్నో ఇబ్బందులు పడుతుం టాం రీసర్వేతో చెక్ పెట్టేచు అన్నారు. సర్వేర్ బ్రహ్మయ్య,జూనియర్ అసిస్టెంట్ మల్లేష్,వీఆర్వో తిప్పన్న,సర్వేయర్ రోజా తదితరులు పాల్గొన్నారు.


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉచిత కంటి ఆపరేషన్‌కు విశేష స్పందన

ప్రజాశక్తి - ఆదోని

జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శాంతి రామ్ ఆసుపత్రి ఆరోగ్య శ్రీ సౌజన్యంతో ఆదివారం బార్ పేట పోస్టాఫీసు వద్ద ఉర్దూ ఘర్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని శిబిర దాత ఎన్‌ఆర్ఐ, ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు నగేష్ కాకుబాళ్ తెలిపారు. 300 మంది పేషంట్లు హాజరై కంటి పరీక్షలు చేయించుకు న్నారని అందులో 83 మంది కంటి ఆపరేషన్లకు వైద్యులు ఎంపిక చేశార న్నారు. అంతకుముందు నాయకులు రాయచోటి సుధాకర్, వంకదారు శ్రీనాథ్ గుప్తా, బద్రి, విశ్వనాథ్, శ్రీధర్ హాజరై జ్యోతి ప్రజ్వల చేశారు. నంద్యాల శాంతిరాం హాస్పిటల్‌లో ఉచిత ప్రయాణ సౌకర్యంతో ఆపరేష్లు చేయిస్తామన్నారు. నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపాలనే సంకల్పంతో గతంలో వందల మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయించడంతోపాటు సంతానం లేని వారికి ఉచిత వైద్య పరీక్షల శిబిరం నిర్వహించామన్నారు. గీత, కవితశ్రీ, బిందు పాల్గొన్నారు.

ఘనంగా ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆవిర్భావ వేడుకలు


అంబులెన్స్ ప్రారంభిస్తున్న డీఎస్పీ సీతారామయ్య

ప్రజాశక్తి - విలేకరులు

ఎమ్మిగనూరు : ఎమ్మిగనూరు పట్టణంలోని వీవర్స్ కాలనీలోని వేదాస్ వృద్ధా ఆశ్రమంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ 16వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మిగనూరు సబ్ డివిజన్ డీఎస్పీ బి.సీతారమయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఎస్పీ సీతారామయ్య మాట్లాడారు. విలేకరి వృత్తి ఎంతో గౌరవ ప్రధానం అని అన్నారు. అనంతరం డిఎస్పీ సీతారామయ్య, జర్నలిస్టులు కలిసి కేక్ కట్ చేసి, వృద్ధులకు పండ్లు అందజేశారు. అలాగే పట్టణంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ తరుపునఉచిత అంబులెన్స్‌ను డిఎస్పీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై మస్తాన్ వలి, కానిస్టేబుల్స్ రంగ స్వామి, రాము, ఏపీడబ్ల్యూ జేఎఫ్ తాలూకా అధ్యక్షుడు షబ్బీర్, గౌరవ అధ్యక్షులు యూ. చంద్రశేఖర్, ఉప అధ్యక్షులు వెంకటేష్, ట్రెజరరీ ఖాదర్ బేగ్, గజేంద్ర,వీరేశ్, మునీర్, ఉస్మాన్, సురేంద్ర, ఇలియాస్,ఖలీల్,సుహెల్, శ్రీనివాసులు, నందవరం ఖలీల్,సద్దాం,రఫిక్, అంబులెన్స్ డ్రైవర్ ఖతాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు : ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ 16వ వార్షికోత్సవ వేడు కలను ఆదివారం స్థానిక జ్యోతిబసు భవన్‌లో నిర్వహించారు. ఏపి డబ్ల్యూజెఎఫ్ 16వ వార్షికోత్సవాని పురస్కరిం చుకొని తాలుకా గౌరవ అధ్యక్షులు పాండు రంగ కేక్ కట్ చేశారు. అధ్యక్ష, ప్రధానకార్యదర్శి మోహన్ రాజు, క్రిష్ణ మాట్లాడుతూ జర్నలిస్టు లకు ఇంటిస్థలాన్నీ ఇవ్వాలని కేబినెట్‌లో తీర్మానించడంపై సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. అక్రిడియేషన్‌తో సంబంధం లేకుండా జర్నలిస్టులకు ఇంటిస్థలాలు ఇవ్వాలని కోరారు. ఉపాధ్యక్షులు జగదీష్ రెడ్డి,సహాయ కార్యదర్సులు రవి,సాయి,డివైఎఫ్ఐ నాయకులు మైన,గోవర్ధన్ పాల్గొన్నారు.

ఆదోని: ఎపిడబ్ల్యుజెఎఫ్ 16వ వార్షికోత్సవం ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ నందు సంఘం నాయకులు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ముందుగా కేక్‌ని కట్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకొని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడు నాగరాజు, అధ్యక్షుడు బసవరాజ్, ఉపాధ్య క్షులు ఉరుకుందప్ప, విజయ్, కార్యదర్శి మునేప్ప, కోశాధికారి సుధాకర్ సహాయ కోశాధికారి పురుషోత్తం మాట్లాడారు. నాయకులు షంషేర్ ఖాన్, చంద్ర, మురళి, రఘు, చక్రవర్తి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఆదోని : ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని కేక్ కట్ చేస్తున్న దృశ్యం


ఆలూరు : కేక్ కట్ చేస్తున్న ఏపీడబ్ల్యుజేఎఫ్ నేతలు

బివిజె అవమానించాడు

- మాధవరావు దేశాయ్
- ప్రాణం ఉన్నంత వరకు టిడిపిని వీడను


సమావేశంలో మాట్లాడుతున్న మాధవరావు దేశాయ్

ప్రజాశక్తి - నందవరం

అధికారంలో లేకపోయినా నాలుగేళ్ల బివి జయ నాగేశ్వర రెడ్డిని నమ్ముకున్న తనను అందరిలో అవమానించారని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు, తాలూకా క్లస్టర్ ఇన్‌ఛార్జ్ మాధవరావు దేశాయ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన తన స్వగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013 పంచాయతీ ఎన్నికల్లో జయ నాగేశ్వర రెడ్డి తమకు వ్యతిరేకంగా మరో వర్గానికి మద్దతు తెలిపిన తాము ఇండిపెండెంట్‌గా గెలిచి, మళ్లీ బివిజె సమక్షంలోనే పనిచేయడం జరిగిందని, గత ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవిపై ఇచ్చిన జీవోపై కోర్టుకు వెళ్లి స్టే తెచ్చారని, బివిజేపై కూడా అధిష్టానానికి ఫిర్యాదు చేసిన వారినే మళ్లీ పక్కన పెట్టుకొని రాజకీయం చేయడం తనను అవమానించడమేనన్నారు. టిడిపి తనకు తాలుక స్థాయి పదవి ఇచ్చి, తనకు తెలియకుండా తన మండలం, గ్రామంలోని వ్యక్తులను పార్టీలోకి చేరితే తనకు చిన్న సమాచారం కూడా ఇవ్వలేదంటే జయ నాగేశ్వర్ రెడ్డి ఏ విధంగా వ్యవహరిస్తున్నారో అర్థం అవుతోందన్నారు. పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా బివిజె వెంటే నడిచానన్నారు. సీనియర్ నాయకులను కాదని మరో వర్గాన్ని ప్రోత్సహిస్తూ గ్రామ నాయకులు మధ్య ఒకరిపై ఒకరు ఆధిపత్యం చెలాయించుకునే విధంగా బివిజె రాజకీయాలు చేస్తున్నార న్నారు. 2019లో గెలిచిన చెన్నకేశవరెడ్డికి మద్దతు తెలిపిన వారిని పక్కన పెట్టుకొని రాజకీయం చేయడం సరికాదన్నారు. దీపావళి తర్వాత తన రాజకీయ భవిష్యత్తుపై ముఖ్యమైన సమాచారాన్ని అందిస్తానని తెలిపారు.

విశ్వరూప మహాసభను జయప్రదం చేయండి : ఎంఆర్‌పిఎస్


కరపత్రాలను పంపిణీ చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

ప్రజాశక్తి - కోసిగి

ఈనెల 11న జరుగునున్న మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎంఎస్పి రాష్ట్ర అధ్యక్షుడు వై విశ్వనాథ్ మాదిగ అన్నారు. ఆదివారం ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మండల కన్వీనర్ చింతకుంట సామెల్ మాదిగ, ఎంఎస్పి జిల్లా కన్వీనర్ దుర్గప్ప మాదిగ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎస్పి రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఈనెల 11వ తేదీన హైదరాబాద్ నగరంలోని పరేడ్ గ్రౌండ్ నందు మాదిగ ఉపకలాల విశ్వరూపం మహాసభ మందకృష్ణ నాయకత్వంలో జరుగుతోందని, ముఖ్య అతిథులుగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పాల్గొంటారని మాదిగలందరూ పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ చింతకుంట సామెల్, ఎంఎస్పి జిల్లా కోకన్వీనర్ దుర్గప్ప కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల కో కన్వీనర్లు ఎస్ ఈరన్న, మొండి నరసింహులు మాదిగ, నాగరాజు మాదిగ , గ్రామ నాయకులు రంగన్న మాదిగ,ప్రకాష్, నర్సింహులు, ఉసెని, తదితరులు పాల్గొన్నారు.

నూతన గ్రామ కమిటీ ఎన్నిక


అభివాదం తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

దళితులు గొడవలకు దూరంగా ఉండి అందరూ ఐక్యంగా ఉండాలని ఏపీ ఎమ్మార్పీఎస్ కోసిగి మండల గౌరవ అధ్యక్షులు మాణిక్య రాజు మండల సలహాదారులు సొట్టయ్య అన్నారు. ఆదివారం ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ ఆదేశాల మేరకు కోసిగి మండలం సజ్జలగుడం గ్రామంలో మండల ఉపాధ్యక్షులు నరసింహులు సహాయ కార్యదర్శి హనుమంతుల ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు బి ప్రదీప్ కుమార్ అధ్యక్షతన ఏపీ ఎమ్మార్పీఎస్ సజ్జలగుడం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామంలో దళితులు కలిసికట్టుగా ఉండి ఐక్యంగా ఉండాలన్నారు. గొడవలకు వెళ్లకుండా కలిసిమెలిసి ఉండాలన్నారు. గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా గంధాల ఈరన్న, గౌరవ సలహాదారు రాముడు, అధ్యక్షుడు ఎస్. శాంతరాజు, ఉపాధ్యక్షులు పి ముకప్ప, గందాల ఉలిగప్ప, ఎస్ తిమ్మయ్య, ప్రధాన కార్యదర్శి పెద్ద ఈరన్న, కార్యవర్గ సభ్యులు గంధాల లసమయ్య, గంధాల హనుమంతు, కె. నరేష్, గంధాల చిన్ని ఉలిగప్ప, కలశం రాజు, మిలిటరీ పులిగప్ప, పల్లె నరసప్ప, రుద్రప్ప మరియు సహకార దర్శులు బూతుల వీరేష్, గంధాల ఎల్లప్ప,సిరి రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అర్హులు ఓటుకు నమోదు చేసుకోండి

ప్రజాశక్తి- పెద్దకడబూరు

మండల పరిధిలోని అర్హులైన యువతి యువకులందరూ కొత్తగా ఓటర్ నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని ఆర్వో రమా కోరారు. ఆదివారం పెద్దకడబూరు మండలంలోని కంబదహాల్, కమ్మలు దీన్ని జలవాడిలలో ఓటర్ నమోదు ప్రత్యేక క్యాంపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భం గా ఆర్వో మాట్లాడుతూ ఓటర్ వెరిఫికేషన్ నిర్వహించాలని ఆదేశించారు. తాసిల్దార్ వీరేంద్ర గౌడ్, ఆర్ఐ మహేష్, ఏఎస్ఐ ఓ వెంకటేశ్వర్లు. బీఎల్వోలు తదితరు పాల్గొన్నారు.


ప్రత్యేక క్యాంపులు తనిఖీ చేస్తున్న ఆర్వో , తహసిల్దార్ వీరేంద్ర గౌడ్


రాజకీయ పార్టీకి దీటుగా మాల మహానాడు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాజకీయ పార్టీకి ధీటుగా మాల మహానాడులో యువత చేరుతు న్నారని మాల మహానాడు నాయకులు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా అధ్యక్షులు మల్లేష్, జిల్లా యువదళం నాయకులు బలరాం, డివిజన్ నాయకులు దామోదర్, ముఖ్య నాయకులు అగ్రహారం వెంకటేష్, రంగమునిల ఆధ్వర్యంలో యువత చేరారు.

వివిధ గ్రామాల రజకుల యూత్, కుంకనూరు నుండి మాల యూత్ భారీగా వాహనాలతో వచ్చి రంగయ్యని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో పూలమాలలతో సన్మానించి సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారు. సామాన్యులను అందు బాటులో ఉండాలని రంగయ్య సూచించారు. ఈకార్యక్రమంలో గుడికల్ రంగస్వామి, పరమేష్, కంపాడు చాకలి వీరేష్, నల్లరెడ్డి, అయ్యప్ప, దామోదర్, యస్వంత్, కుంకునూరు నుండి మాల నాగరాజ్ యూత్ తదితరులు పాల్గొన్నారు.


రంగయ్య సమక్షంలో మాలమహానాడులో చేరుతున్న యువత





కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న నాయకులు

సాగునీటి కోసం రైతుల ఆగ్రహం

- 25 వేల ఎకరాల్లో ఎండుతున్న పంటలు
- కెనాల్ దగ్గరికి కదిలివచ్చిన రైతులు
- లింక్ ఛానల్ గేట్లు ఎత్తి నీళ్లు వదులుకున్న వైనం



నూనెపల్లె ఛానల్ కెనాల్ కట్ట వద్దకు కదలి వచ్చిన ఆయా గ్రామాల రైతులు

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

సాగునీటిని విడుదల చేయడంలో ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంపై నంద్యాల, గోస్పాడు మండల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం కెసి కెనాల్ నూనెపల్లె ఛానల్ కింద ఉన్న ఆయకట్టు రైతులు కాల్వ వద్దకు భారీగా చేరుకుని గేట్లు తెరిచారు. తమ పంట పొలాలు తడిసేంత వరకు ఇక్కడి నుండి వెళ్లేది లేదని ఆందోళన చేపట్టారు. వివరాలు.. నంద్యాల మండలంలోని కెసి కెనాల్ నూనెపల్లె ఛానల్ కింద ఉన్న పొన్నాపురం, గాంధీనగర్, మూలసాగరం, చాబోలు, రైతు నగరం, చాపిరేవుల, సుబ్బారెడ్డి పాలెం, కానాల, పాండురంగాపురం, మిట్నాల, బ్రాహ్మణపల్లె, ఏ.శివరామపురం, బి.శివరామ పురం, పుసులూరు, చింతకుంట్ల, జునేపల్లి, పసురపాడు, గోస్పాడు, తేళ్ళపురి తదితర 20 గ్రామాలకు సంబంధించి దాదాపు 25 వేల ఎకరాలకు ఈ ఛానల్ కింద ప్రతి రోజూ 150 క్యూసెక్కుల సాగు నీరు ఇవ్వాలి. కానీ ఈ ఏడాది వర్షాలు సరిగా లేకపోవడంతో ప్రాజెక్టులలో నీరు లేక 30 నుండి 40 క్యూసెక్కులు మాత్రమే నీరు ఇస్తున్నారు. ఈ నీరు పాండురంగాపురం గ్రామం దాటి దిగువ గ్రామాలకు చేరకపోవడంతో రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. ఆయా గ్రామాల రైతులు ట్రాక్టర్లపై, ద్విచక్ర వాహనాలలో, కార్లలో పొన్నాపురం దగ్గర ఉన్న కెసి కెనాల్ వద్దకు తరలివచ్చారు. మెయిన్ కెసి కెనాల్ కాల్వకు ఉన్న గేట్లు మూసివేశారు. అనంతరం నూనెపల్లె ఛానల్ కాల్వ గేట్లను ఎత్తి తమకు రావాల్సిన 140 క్యూసెక్కుల నీరు విడుదల చేసుకున్నారు. విషయం తెలిసిన వైసిపి నాయకుడు ఆదిరెడ్డి అక్కడికి చేరుకొని 'మీరే అన్ని నీళ్లు తీసుకెళ్తే... మెయిన్ కెనాల్ కింద ఉన్న దిగువ ప్రాంతం వాళ్లకు నీరెలా..' అని ప్రశ్నించాడు. దీంతో రైతులకు ఆయనకు మధ్య వాదన చోటు చేసుకుంది. కానీ రైతులు తమ పొలాలు తడిసేంతవరకు నీరు వదిలే సమస్య లేదని కట్టపైనే ఆందోళనకు దిగారు.

పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని ఆదిరెడ్డిని అక్కడికి నుండి పంపించేశారు. కెసి కెనాల్ కింద సాగునీరు వస్తుందనే ఆశతో రైతులు 25 శాతం వరి పంట వేశారు. దిగువ గ్రామాలలో 10 శాతం మిరప, 15 శాతం, మినుము, 50 శాతం జొన్న పంటలు వేశారు. విత్తనం వేసింది మొదలుకొని ఈ రోజు వరకు చుక్క నీరు రాక పంటలన్నీ ఎండి పోతున్నాయని, నీరు ఎమ్మెల్యే వెంచర్‌లోకి వెళ్తున్నాయని రైతులు ఆరోపించారు. ప్రస్తుతం వదులుతున్న నీరు చాలా తక్కువగా ఉండడంతో దిగువ పొలాలకు అందలేదని తెలిపారు.

రైతులకు మద్దతు తెలిపిన మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి

పొన్నాపురం దగ్గర కెసి కెనాల్ వద్ద రైతులు చేస్తున్న ఆందోళన వద్దకు మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి అక్కడికి చేరుకుని మద్దతు తెలిపారు. నంద్యాల, గోస్పాడు మండలాల రైతులు తమ పంటలు ఎండిపోతున్నాయని, నూనెపల్లె ఛానల్‌కు పది రోజుల పాటు పూర్తిగా నీళ్లు వదలాలని అధికారులను కోరారు. దీంతో అధికారులు ఒప్పుకుని నీటిని వదిలారు. అయితే రైతులు మాత్రం మళ్లీ గేట్లు మూసి వేస్తారేమోనని రాత్రి వరకు కట్టపైనే ఉన్నారు.



కెసి కెనాల్ అధికారులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

హక్కుల సాధనకు ఉద్యమం

- అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి
- ఎపిడబ్ల్యుజెఎఫ్ ఫెడరేషన్ నాయకులు
- ఘనంగా ఎపిడబ్ల్యుజెఎఫ్ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - నంద్యాల

ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో పని చేస్తున్న అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ 16వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఆదివారం నంద్యాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షులు శివ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఫెడరేషన్ వ్యవస్థాపకుల్లో ఒకరు సీనియర్ నాయకులు, జిల్లా ఉపాధ్యక్షులు మాదాల శ్రీనివాసులు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబెర్ డి.మౌలాలి, పట్టణ కార్యదర్శి జగన్ మోహన్, పట్టణ ఉపాధ్యక్షులు జాషువ, నాయకులు మల్లికార్జున తదితరులు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ 16 ఏళ్ల నుండి వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలపై, హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతుందని తెలిపారు. రాష్టంలో వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వం 3 సెంట్లు కేటాయించడం హర్షనీయమన్నారు. ప్రభుత్వం విధివిధానాలు ప్రకటించాలని కోరారు. అక్రిడిటేషన్ కమిటీలో జర్నలిస్ట్ సంఘాలకు ప్రాతినిధ్యం ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జర్నలిస్ట్‌లు శ్రీనివాసులు, మురళి, సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు. **పాణ్యం :** పాణ్యంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ 16వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పాణ్యం నియోజక వర్గ అధ్యక్షుడు వైవి.సుబ్బయ్య మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాసులు, విలేకరులు రమేష్, రంగస్వామి, శ్రీను, ఎకె.రవి, సుబ్బరాయుడు పాల్గొన్నారు. **బనగానపల్లె :** పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు మద్దయ్య యాదవ్, నియోజకవర్గ అధ్యక్షులు గుండం సర్వేశ్వర రెడ్డిల ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేశారు. నియోజకవర్గ ఉపాధ్యక్షులు రామచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, జవహర్, సీనియర్ జర్నలిస్టులు వెంకటేశ్వర్లు, వెంకట రాముడు, మండల గౌరవ అధ్యక్షులు ఎం.రఘురామిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు రఘు రామిరెడ్డి, మధు, ప్రధాన కార్యదర్శి చెన్నయ్య, కార్యదర్శి రాజేష్, నాయకులు శ్రీకాంత్, గురప్ప, వేణుగోపాల్ రెడ్డి, బాలయ్య, దస్తగిరి, వెంకట రాముడు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** పట్టణంలోని అనంత కళాశాలలో ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. తాలూకా అధ్యక్షుడు శ్రీనివాసరావు, రాష్ట్ర సభ్యులు నిజాముద్దీన్, కోశాధికారి నాగరాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు టీవీఎస్వీ ప్రసాద్, ప్యాపిలి ప్రసాద్, మహమ్మద్ హుస్సేన్, అరుణ్, అక్షింతల శ్రీనివాస్, ఖాసిం వలి, డిడి8 భాష, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న నాయకులు

8న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - బేతంచెర్ల

కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం, విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఈనెల 8న రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు కోరారు. ఆదివారం బేతంచెర్ల పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు బంద్ వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా నాయకులు మధు శేఖరు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం 32 మంది ప్రాణ త్యాగం చేశారని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు మోడీ ప్రభుత్వం పూనుకోవడం దారుణమన్నారు. ప్రైవేటీకరణను నిరసిస్తూ జరుగుతున్న పోరాటం ఈ నెల 8 నాటికి వెయ్యి రోజులు పూర్తి అవుతుందని చెప్పారు. వారికి సంఘీభావంగా విద్యార్థి, యువజన సంఘాలు ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొనేందుకు ఈ నెల 8న రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బందును పిలుపునిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి, యువజన నాయకులు మహేష్, నాగరాజు, వన్నూరు వలి, దినేష్, ప్రేమ్ చందులు పాల్గొన్నారు.

డిసెంబర్ 7,8 తేదీల్లో నందిబాలోత్సవం

- అమరావతి బాలోత్సవం రాష్ట్ర కార్యదర్శి యువి రామరాజు
- ఆహ్వాన సంఘం సన్నాహక కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాలలో డిసెంబర్ 7, 8వ తేదీలలో జరుగు నంది బాలోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అమరావతి బాలోత్సవం రాష్ట్ర కార్యదర్శి యువి రామరాజు తెలిపారు. నంది బాలోత్సవ కార్యక్రమం విజవంయతం కోసం ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశం ఆదివారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలోని మినీ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ న్యాయవాది భగత్ సింగ్ గ్రంధాలయం సంస్థ చైర్మన్ బి. శంకరయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా యువి రామరాజు మాట్లాడుతూ విద్యార్థులలో సామాజిక స్పృహ కల్పించాలనే ఉద్దేశంతోనే బాలోత్సవ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా డిసెంబర్ 7, 8వ తేదీలలో నంద్యాల పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల టౌన్ హాల్‌లో నిర్వహించబోతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ జూనియర్ సీనియర్స్ 3 విభాగాలలో దాదాపు 40 రకాల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారన్నారు. నంద్యాలలో మొదటిసారిగా బాలోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, జయప్రదానికి ప్రముఖులు సహకరించాలని కోరారు. అనంతరం ఆహ్వాన సంఘం సన్నాహక కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్షులు డా. నాగరాజు, జిల్లా కార్యదర్శి గోపాల్, ప్రముఖ బిల్డర్ డి. క్రాంతికుమార్, నంది విజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ రామరాజు నగేష్, మౌలాలి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్, సుధాకర్, గురుస్వామి, మాదాల శ్రీనివాసులు, నరసింహ, దస్తగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నంది బాలోత్సవం ఆహ్వాన సంఘం సన్నాక కమిటీ :

ఆహ్వాన సంఘం సన్నాహక కమిటీ గౌరవ అధ్యక్షులుగా గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ దస్తగిరి రెడ్డిని, అధ్యక్షులుగా ఆర్‌జిఎం విద్యా సంస్థల అధినేత మిద్దె శివరాం, ప్రధాన కార్యదర్శిగా నాగేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మౌలాలి, గౌరవ సలహాదారులుగా భగత్ సింగ్ గ్రంధాలయం చైర్మన్ బి.శంకరయ్య, నంది విజ్ఞాన కేంద్రం కన్వీనర్ బి.రామరాజుతో పాటు మరో 40 మందిని చీఫ్ ప్యాట్రన్స్, ప్యాట్రన్స్, కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు యువి రామరాజు



మంత్రికి పనుల పురోగతిని వివరిస్తున్న చైర్మన్

టెన్నిస్, క్రికెట్ కోర్టు పనులను పరిశీలించిన ఆర్థికమంత్రి

ప్రజాశక్తి-డోన్

డోన్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌టిసి బస్టాండు దగ్గర కొత్తగా నిర్మిస్తున్న టెన్నిస్, క్రికెట్ కోర్టుల పనులను ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. పనులను వేగంగాపూర్తి చేయాలని మంత్రి అధికారులకు, కాంట్రాక్టర్‌లకు సూచించారు. యువక్రీడాకారులను ప్రోత్సహిం చేందుకు రూ.15లక్షలతో టెన్నిస్, క్రికెట్ నెట్ ప్రాక్టిస్ చేయడానికి ఈ కోర్టులను నిర్మిస్తున్నారు. మంత్రితో పాటు డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేశ్, ఇతర నాయకులు, అధికారులు ఉన్నారు. అక్కడి పరిస్థితిని, పనుల పురోగతిని మంత్రికి మున్సిపల్ చైర్మన్ వివరించారు.

మల్లన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి వెంకట జ్యోతిర్మయి కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ముందుగా వీరు స్వామి అమ్మ వార్ల దర్శనం కోసం రాజగోపురం వద్దకు చేరుకోగానే ఆలయ అధికారులు, అర్చకులు, వేద పండితులు సాంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామివారిని, అమ్మవారిని ప్రత్యేకంగా దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వేద పండితులు వారికి ఆశీర్వచనం పలికారు. శేష వస్త్రాలను, ప్రసాదాలను, జ్ఞాపికను ఆలయ అధికారులు అందజేశారు.



స్వాగతం పలుకుతున్న అధికారులు, అర్చకులు, వేద పండితులు

కరువును పట్టించుకోని ప్రభుత్వం : టిడిపి

ప్రజాశక్తి - బనగానపల్లె

రాష్ట్రంలో కరువు తాండవిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కలెక్షన్, ఎలక్షన్ తప్ప రైతులు, ప్రజల గురించి పట్టించుకోవడంలేదని టిడిపి వ్యవసాయ స్టీరింగ్ కమిటీ సభ్యులు, మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పత్తిపాటి పుల్లరావులు విమర్శించారు. ఆదివారం మండలంలోని పాతపాడు, జోలాపురం, చిన్నరాజుపాలెం గ్రామాలలో బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఆధ్వ ర్యంలో టిడిపి వ్యవసాయ స్టీరింగ్ కమిటీ సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పత్తిపాటి పుల్లారావు, మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, నల్లమల్లి రామకృష్ణారెడ్డి, టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్‌లు ఎండిపోయిన పంటలను పరిశీలించి,రైతుల రైతులను అడిగి నష్టాన్ని తెలుసుకున్నారు. దద్దనాల ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో 470 మండలాలలో కరువు నెలకొంటే 103 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం దారుణం అన్నారు. కరువు నెలకొనా.. ముఖ్యమంత్రి కాని, మంత్రులు, ప్రజాప్రతినిధులు కాని పొలాల వైపు కన్నెత్తి చూడడంలేదన్నారు. రైతులకు పంటలను కాపాడుకునేందుకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరకు 80 శాతం సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కూలీల వలసల నివారణకు ఉపాధి హామీ పథకం పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

దద్దనాల ప్రాజెక్టును నిర్వీర్యం చేశారు : మాజీ ఎమ్మెల్యే బీసీ

27 గ్రామాలకు సాగు తాగునీటిని అందించే దద్దనాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి విమర్శించారు. టిడిపి పాలనలో ఎస్‌ఆర్బిసి కాలువ నుండి దద్దనాల ప్రాజెక్టుకు లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేస్తే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దద్దనాల ప్రాజెక్టు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని పంపిణీ చేయకుండా నిర్వీర్యం చేసిందన్నారు. బోర్లలో భూగర్భ జలాలు ఇంకిపోయి రైతులు వేసిన పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయి, పశువులకు నీళ్లు లేక, తాగు, సాగునీటి కష్టాలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో పాతపాడు కాపులపల్లె సర్పంచులు బెడదల మహేశ్వర రెడ్డి, తులసి రెడ్డి, పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, యాగంటి పల్లె ఉపసర్పంచ్ బండి మౌళేశ్వర రెడ్డి, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు బొబ్బల గోపాల్ రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు కృష్ణా నాయక్, బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దరాజుపాలెం భూషన్న, నాయకులు కాట్రెడ్డి మల్లికార్జున్ రెడ్డి, రాయలసీమ సలాం, బాల నాయుడు, షేక్షావలి, కామేష్, గంధం హుసేని, తలారి తిరుమలయ్య చిన్నరాజుపాలెం నరసింహ, రామాంజనేయులు, రంగస్వామి యాదవ్, టిడిపి నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.



ఎండిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న టిడిపి వ్యవసాయ స్టీరింగ్ కమిటీ సభ్యులు

8న అనంత కళాశాలలో జాబ్ మేళా

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : ఈనెల 8న పట్టణంలోని అనంత విద్యాసంస్థల్లో హెరిటో డ్రగ్స్ కంపెనీ వారు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు అనంత విద్యాసంస్థల అధినేత అనంత రామసుబ్బారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసుకున్న యువతీ యువకులకు ఇది మంచి అవకాశం అని దీనిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. 2019-2023 లో డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థిని, విద్యార్థులు జాబ్ మేళాలో పాల్గొనాలన్నారు.

నేడు ప్రజా బ్యాలెట్‌ను జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

విద్యుత్ చార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా నేడు నందికొట్కూర్ పట్టణంలోని పటేల్ సెంటర్లో నిర్వహించే ప్రజా బ్యాలెట్‌లో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు కోరారు. ఆదివారం నందికొట్కూరు పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో నాయకులు పి పకీర్ సాహెబ్, టి గోపాలకృష్ణ, బాలయ్య, నారాయణతో కలిసి ఆయన విలేకరులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసి వ్యవసాయ బోర్లకు మీటర్లు బిగిస్తున్నారని, గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగించబోతున్నారని చెప్పారు. 2014 నుంచి ట్రూ అప్, సర్దుబాటు చార్జీల పేరుతో రూ.23 వేల కోట్లు రాష్ట్ర ప్రజలపై విద్యుత్ చార్జీల భారం వేశారన్నారు. 2000 సంవత్సరంలో తెలుగుదేశం పార్టీ హయాంలో విద్యుత్ రంగాన్ని జెన్కో, డిస్కో, ట్రాన్స్కో మూడు ముక్కలు చేసి చంద్రబాబు నాయుడు ప్రైవేటీకరణ చేస్తే వాటికి వ్యతిరేకంగా నాడు కమ్యూనిస్టులతో కలిసి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆందోళనలో పాల్గొన్నారని తెలిపారు. నేడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనయుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి నరేంద్ర మోడీ ప్రభుత్వానికి తల్గొగ్గి విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసి వ్యవసాయ బోర్లకు మీటర్లు బిగించబోతున్నారని, గృహ వినియోదారులపైన విచ్చలవిడిగా విద్యుత్ చార్జీలు పెంచి భారాల మోపుతున్నారని తెలిపారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా. విద్యుత్ చార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా నేడు ఉదయం 10 గంటలకు నందికొట్కూరు పటేల్ సెంటర్లో జరిగే ప్రజా బ్యాలెట్‌లో ప్రజలందరూ పాల్గొని తమ అభిప్రాయాన్ని ఓటు ద్వారా తెలియజేయాలని కోరారు.



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు

అంగన్వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - చాగలమర్రి : ఆళ్లగడ్డ తాలూకాలోని వివిధ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్ సుశీల ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తాలూకాలోని చిన్న బోధనం, వీరారెడ్డి పల్లె, పేరూరు, పి.కంబలూరు గ్రామాలలో అంగన్వాడీ ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకోవాల్సిన అభ్యర్థులు పదవ తరగతి పాస్ అయి ఉండాలని, జూలై 1 నాటికి 21 సంవత్సరాలు నిండి ఉండాలని, తప్పనిసరిగా వివాహిత అయి ఉండాలని,పుట్టిన తేదీ, వయసు, కుల ధ్రువీకరణ, ఆధార్, రేషన్ తదితర ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులను ఈ నెల 11వ తేదీలోపు ఆళ్లగడ్డలోని సిడిపిఒ కార్యాలయంలో అందజేయాలని వివరించారు.

నేడు స్పందన కార్యక్రమం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : నేడు నంద్యాల పట్టణం కలెక్టరేట్ లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు ఉదయం 9-30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలని తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

దామగట్లలో పేరుకుపోయిన చెత్త

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు మండలంలోని దామగట్ల గ్రామంలో మెయిన్ రోడ్డు పక్కన చెత్త కుప్పలు పేరుకుపోయాయి. గత ఎనిమిది నెలల నుండి చెత్త కుప్పలు ఉంటున్నాయి. సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో తడి, పొడి చెత్త అంటూ ప్రతిరోజు ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్‌లకు తరలిస్తూ ఉంటారు. కానీ గత ఎనిమిది నెలలుగా ప్రజలందరికీ కనబడుతున్న చెత్త పాలకులకు, అధికారులకు కనపడకపోవడం దారుణం. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్డు పక్కన ఉన్న చెత్త కుప్పలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



రహదారి పక్కనే పేరుకుపోయిన చెత్త



మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర నాయకులు

జగన్ పాలనలో వలసల రాజ్యం

- టిడిపి రాష్ట్ర నాయకులు

ప్రజాశక్తి - ప్యాపిలి

రాష్ట్రంలో వ్యవసాయానికి 7 గంటలు కూడా కరెంటు ఇవ్వలేని స్థితిలో వైసిపి ప్రభుత్వం ఉందని, జగన్ పాలనలో వలసల రాజ్యం వచ్చిందని టిడిపి మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పత్తిపాటి పుల్లారావు, మాజీ ఎమ్మెల్యే పిన్నెలి రామకృష్ణారెడ్డి విమర్శించారు. ఆదివారం ప్యాపిలి మండలంలోని బావిపల్లె క్రాస్ రోడ్డు వద్ద వారు మాట్లాడారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు నష్టపరిహారం కింద మిరప, పత్తికు రూ. 50 వేలు, మొక్కజొన్నకు రూ. 30 వేలు, వేరుశనగకు, కందికి రూ. 30 వేలు ఇవ్వాలన్నారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సొంత మండలాన్ని కరువు ప్రకటించారే తప్ప మిగతా మండలాలు ప్రకటించలేదన్నారు. రాయలసీమలో కరువు లేదా మీకు మిగతా మండలాలు కనబడలేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో టిడిపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి, పెద్ద నాగిరెడ్డి, వలసల రామకృష్ణ, మురళీకృష్ణ గౌడ్, గౌతంరెడ్డి, రాఘవేంద్ర, వెంకటేస్వరరెడ్డి, ప్రసాద్ రెడ్డి శీనువాసులు, అంకిరెడ్డి,మాందొడ్డి బాబు, రామసుబ్బయ్య, సుధాకర్, రామ్మోహన్ యాదవ్, చిన్న సుంకయ్య, సుదర్శన్, సత్యం, రాజశేఖర్, నాగేంద్ర, ప్రిన్సిపాల్ మధు, మల్లికార్జున, రామాంజనేయులు, ఖాజాపీర్, ఎస్కేవలీ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

పారువేట గ్రామాల్లో అహోబిల నృసింహ దాస కార్యక్రమాలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఈనెల 8వ తేదీ నుండి పారువేట గ్రామాలలో అహెూబిల నసింహ దాస కార్యక్రమాలు ప్రారంభమవుతాయని కమ్యూనికేషన్ అధికారి సేతారామన్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 8న బాచేపల్లే గ్రామంలోని శ్రీకృష్ణ ఆలయంలో, 15న కోట కందుకూరు చెన్నకేశవ స్వామి ఆలయంలో, 22న ఆలమూరు ఆంజనేయ స్వామి ఆలయంలో, 29న ఆళ్లగడ్డ పట్టణంలోని అమ్మవారి శాలలో అహెూబిలం నరసింహ దాస కార్యక్రమాలు, పీఠాధిపతి ఆజ్ఞ మేరకు సుదర్శన హెూమం, ప్రవచనాలు నిర్వహిస్తామన్నారు.

దర్గాలో ఎమ్మెల్యే ఫాతేహాలు

ప్రజాశక్తి - బనగానపల్లె : పట్టణంలోని హైస్కూల్ గ్రౌండ్ ఆవరణంలోని దస్తగిరి స్వామి దర్గాలో గ్యార్మీ పండుగను పురస్కరించుకొని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆదివారం ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కూరగాయల మహబూబ్ బాషా, ఆంధ్ర భాష, కృష్ణారెడ్డి, రఘునాథరెడ్డి, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.



దర్గాలో పాతేహాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే



అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఆ నలుగురు స్వచ్ఛంధ సంస్థ సభ్యులు

అనారోగ్యంతో అనాథ వ్యక్తి మృతి

'ఆ నలుగురు' ఆధ్వర్యంలో అంత్యక్రియలు

ప్రజాశక్తి - బేతంచెర్ల : మండలంలోని బుగ్గానపల్లె రైల్వే స్టేషన్ సమీపంలో పాణ్యానికి చెందిన హనుమంతు (60) అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడు చిత్తు పేపర్లు ఏరుకొని వాటిని అమ్ముకొని జీవన సాగించే వాడు. మృతుడికి ఎవరూ లేకపోవడంతో స్థానికులు ఆ నలుగురు స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వన్నూరు బాషకు సమాచారం ఇచ్చారు. వన్నూరు బాష బేతంచెర్ల పోలీసు వారికి సమాచారం ఇచ్చి, ఆయన సభ్య బృందంతో వచ్చి బేతంచెర్ల స్మశాన వాటికలో మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు లక్ష్మీరాఘవ, సద్దాం, వెంకటేశ్వర్లు, యూసుఫ్, అక్బర్, మాబాషా పాల్గొన్నారు.

9న పురంధరేశ్వరి పర్యటన : బిజెపి

ప్రజాశక్తి - బనగానపల్లె : ఈ నెల 9న బనగానపల్లెలో బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పర్యటిస్తారని బిజెపి జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ బైరెడ్డి శబరి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని బివి సుబ్బారెడ్డి ఫంక్షన్ హాల్ బిజెపి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురందరేశ్వరి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి శివకృష్ణ యాదవ్, జిల్లా స్పోక్ పర్సన్ కొట్టే చెన్నయ్య, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

పోస్టాఫీస్ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - బేతంచర్ల : బేతంచెర్ల పట్టణ (దుర్గా పేట) ఎన్జీవోస్ కాలనీ నివాసి పోస్టాపోస్ ఉద్యోగి జొల్లు బాలయ్య (54)) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ పోస్టాఫీస్టర్ గిరిధర్ రావు, ప్రస్తుత పోస్ట్‌మాస్టర్ నరసింహులు, ఆఫీస్ సిబ్బంది హనుమంతు, మాధవ్, కృష్ణారెడ్డి, రంగమ్మ, తదితరులు బాలయ్య మృతదేహానికి నివాళులర్పించారు.

స్కూల్ ఆవరణలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - రుద్రవరం : రుద్రవరం ఏపీ మోడల్ పాఠశాల ఆవరణలో విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో స్కూల్ ఛైర్మన్ మబ్బు వాసు, జైపాల్ బాబాయి, శెట్టి వెంకట చంద్రుడు సమక్షంలో ఆదివారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు మాట్లాడుతూ స్కూల్, హాస్టల్ క్యాంపస్ పరిశుభ్రంగా డోజర్‌తో క్లీన్ చేయించినట్లు తెలిపారు.



పారిశుధ్య పనులు చేయిస్తున్న ప్రిన్సిపల్ నాగేశ్వర రావు

అకాల వర్షం - ఇబ్బందుల్లో మొక్కజొన్న రైతులు

ప్రజాశక్తి - పగిడ్యాల

తుఫాన్ ప్రభావంతో అకాల వర్షాలు కురవడంతో మొక్కజొన్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు 15 రోజుల నుంచి మొక్కజొన్న పంట కోతలు ప్రారంభమయ్యాయి. నూర్పిడి చేసిన మొక్కజొన్నలను బహిరంగ ప్రదేశాలలో రైతులు ఆరబోశారు. తుఫాన్ ప్రభావంతో గత రెండు రోజుల నుంచి వర్షాలు కురవడంతో ఆరబెట్టిన మొక్కజొన్నలు తడవకుండా కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఆదివారం సాయంత్రం అకాల వర్షం కురవడంతో మొక్కజొన్న ధాన్యంను కాపాడుకునేందుకు టార్పాలియన్ పట్టాలను కప్పుతూ ఇబ్బందులు పడ్డారు. అకాల వర్షాలు వల్ల కొంతమంది రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.. మరి కొంతమంది రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రబీ సీజన్లో సాగు చేసిన శనగ, పొగాకు, కంది, మిరప పంటలకు వర్షాలు లేక ఉండి పోతున్నాయని అనుకుంటున్న సమయంలో ఈ వర్షాలు కురవడంతో కొంత మేరకు మేలు జరుగుతుందని రైతులు చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన మొక్కజొన్న పంట తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో ఎండిపోయి కాస్త కూసో చేతికి వచ్చిన పంటను నూర్పిడి చేసుకొని బహిరంగ ప్రదేశాల్లో ఆరబోసుకుంటే అకాల వర్షాల వల్ల తడిసిపోయి నాణ్యత తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యాపారస్తులు తక్కువ రేటుకు కొనుగోలు చేస్తారని పేర్కొంటున్నారు. అకాల వర్షాలకు తడిసిన మొక్కజొన్న పంటను ప్రభుత్వమే గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని రైతులు కోరుకుంటున్నారు.



వర్షం కురుస్తుండడంతో మొక్కజొన్న ధాన్యంపై టార్పాలియన్ పట్టాలను కప్పుతున్న రైతులు

వైద్య సేవకు నిర్వచనం కెపివిఎస్ ప్రభుత్వాసుపత్రి

- రికార్డు స్థాయి ప్రసవాలు
- నిరంతర నిరుపేదల సేవలో వైద్యులు
- ప్రతి రోజూ 110 నుండి 150 వరకు ఒపి

ప్రజాశక్తి - చాగలమర్రి

చిన్నారుల నుంచి పండు ముదుసలి వరకు పేద ధనిక తేడా లేకుండా రాత్రింబవళ్లు నిరుపేదలకు వైద్య సేవలు అందిస్తూ సేవకు నిర్వచనంగా మారింది చాగలమర్రిలోని కెపివిఎస్ (క్రిష్ణం ప్రసాద్ వెంకటసుబ్బయ్య) ప్రభుత్వ ఆసుపత్రి. చాగలమర్రిలోని రిక్వెస్ట్ స్టాప్ వద్దగల కెపివిఎస్ ప్రభుత్వాసుపత్రిలో ఇద్దరు వైద్యులు, ముగ్గురు నర్సులు, ఒక ఫార్మాసిస్టు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక కార్యాలయ సిబ్బంది, నాలుగో తరగతి సిబ్బంది ఇద్దరు, ఇతర సిబ్బంది నలుగురు వైద్య సేవలు అందిస్తున్నారు. వైద్యాధికారి డాక్టర్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో సిబ్బంది, డాక్టరు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిసున్నారు. వివిధ ప్రాంతాల నుంచి రోజు సుమారు 100 నుంచి 150 మంది వరకు రోగులు వైద్య సేవల కోసం వస్తున్నారు. మండల వైద్యాధికారి ప్రతి నెలా గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తూ నిరక్షరాస్యలకు వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు. చాగలమర్రి మండలంలోని 19 గ్రామ పంచాయతీల పరిధిలో ఆయన సుడిగాలి పర్యటనలు చేస్తూ గ్రామీణ ప్రాంతాల గర్భిణులకు, ప్రజలకు వైద్య సేవలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వాసుపత్రిలోనే కాన్పులు చేయించుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. ఫలితంగా గ్రామీణ ప్రాంత గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పులు చేయించుకుంటున్నారు.



చాగలమర్రిలోని కెపివిఎస్ ప్రభుత్వ ఆసుపత్రి

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

- మండల వైద్యాధికారి ఇమ్రాన్



మండలంలోని 19 గ్రామ పంచాయతీల పరిధిలోని నిరుపేదలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. నిరక్షరాస్యులు అవగాహన లేమితో కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి డబ్బులు పోగొట్టుకుంటున్నారు. వారిని ప్రభుత్వాసుపత్రిలోని సేవలు ప్రభుత్వం నుంచి లభించే పథకాలపై అవగాహన కల్పిస్తున్నాం. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాకు చివరన ఉన్న చాగలమర్రి మండలంలో ఉన్న వసతులతోనే నిరంతరం నిరుపేదలకు వైద్య సేవలు అందిస్తున్న కెపివిఎస్ ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది నిరుపేద ప్రజల ప్రశంసలు పొందుతున్నారు. ఉన్నతాధికారులు కష్టపడి పనిచేసే వారికి మరింత ప్రోత్సాహం అందించాలని కోరుతున్నారు.

అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ప్రాజెక్టు నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆత్మకూరు ప్రాజెక్టు నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు యేసురత్నం మాట్లాడుతూ ఎపి అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆత్మకూరు ప్రాజెక్టు అధ్యక్షులుగా వెంకట రమణమ్మ, కార్యదర్శి మంజుల, కోశాధికారిగా ఎస్.లక్ష్మీదేవి, గౌరవ అధ్యక్షులుగా రామ్ నాయక్, ఉపాధ్యక్షులు అరుణ, శ్యామల, దర్గమ్మ, కార్యదర్శులు సావిత్రమ్మ, తులసమ్మ, కుమారి, ఈశ్వరమ్మ, కమిటీ సభ్యులు చంద్రకళ, ప్రియాంక, విజయలక్ష్మి, ప్రమీలమ్మ, భాగ్యలక్ష్మి, అనిత, వసంత, లక్ష్మి నరసమ్మ, స్వర్ణ గౌరీ, కైరున్, సాలమ్మ, పుష్ప లతలను ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శులు వెంకట రమణమ్మ, మంజుల మాట్లాడుతూ బాలింతలు, గర్భిణీ స్త్రీల కోసం సేవలందిస్తున్న అంగన్వాడీలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. ఐసిడిఎస్ అభివృద్ధికి, అంగన్వాడీ, హెల్పర్స్‌ల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామన్నారు.



రైతు గర్జన ర్యాలీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : రైతు సమస్యల పరిష్కారం కోసం ఈనెల 7వ తేదీన కర్నూల్‌లో జరిగే రైతు గర్జన ర్యాలీని జయప్రదం చేయాలని నంద్యాల జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చాకలి సికిందర్ బట్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాలోనీ పలు మండలాల్లో వర్షాలు లేక పంటలు సరిగా రాక అన్నదాత ఆత్మహత్యలు చేసుకుంటున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం నంద్యాల జిల్లాలో కేవలం 6 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడం విడ్డూరమ న్నారు. ప్రభుత్వం తక్షణమే రైతులకు నష్టపరిహారం లక్ష రూపాయలు చెల్లించి, ఆత్మహత్యలు చేసుకున్న రైతులకు ప్రభుత్వం రూ.25 లక్షలు చెల్లించి, ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, వెంటనే మిగిలిన మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలన్నారు.



మాట్లాడుతున్న సికిందర్ బట్

2024లో మళ్లీ అధికారం వైసిపిదే : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

2024 ఎన్నికల్లో వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, బనగానపల్లె ఎమ్మెల్యేగా ప్రజలు తననే ఆశీర్వదిస్తారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం కొలిమిగుండ్ల మండలంలోని తుమ్మలపెంట గ్రామంలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ కోట్లాది రూపాయలతో నియోజకవర్గంలో అభివృద్ధి మరోపక్క సంక్షేమంతో ముందుకు వెళుతూ ఉంటే తెలుగుదేశం పార్టీ నాయకులకు అవాస్తవాలు మాట్లాడుతున్నారని అన్నారు. అంతకుముందు బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలు తుమ్మలపెంట గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిచి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ప్రసాద్ రెడ్డి, తహసిల్దార్ ఆల్ఫ్రెడ్, నియోజకవర్గ వైఎస్ఆర్ పార్టీ ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, మండల వైఎస్ఆర్ పార్టీ కన్వీనర్ అంబటి గురివిరెడ్డి పేరం సత్య నారాయణరెడ్డి, తుమ్మలపెంట గ్రామ వైఎస్ఆర్ పార్టీ నాయకులు తోట మల్లేశ్వర్ రెడ్డి,బాలదస్తగిరిరెడ్డి,సారెడ్డి లక్ష్మిరెడ్డి సర్పంచు మల్లేశ్వరి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



బుకలెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

టిడిపి పాలనలోనే మైనార్టీల అభివృద్ధి : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆత్మకూర్

తెలుగుదేశం పాలనలోని ముస్లిం మైనార్టీలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన జరిగిందని వాటి ద్వారా మైనార్టీ ప్రజలు అభివృద్ధి చెందారని శ్రీశైల నియోజవర్గం మాజీ శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని కోనేరు వద్ద ముస్లిం మైనార్టీల ప్రజా వేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలో కి వచ్చిన వెంటనే ముస్లిం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వాటి ద్వారా ముస్లిం మైనార్టీలకు అన్ని విధాలుగా ఆర్థిక సహాయాన్ని అందించిందన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత మైనార్టీల పథకాలను తొలగించిందన్నారు. చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు బనాయించి ప్రభుత్వం కక్ష సాధింపుకు పాల్పడుతోందన్నారు. అంతకు ముందు ముస్లిం మైనార్టీలు భారీ గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కరిముల్లా, మైనార్టీ నాయకులు సిరివెళ్ల రజాక్, అబ్దుల్లాపురం బాష, కంచర్ల గోవిందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి

వైసిపి పాలనలో దళితులపై పెరిగిన దాడులు

మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మనందరెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ పాలనలో దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని టిడిపి నంద్యాల నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మనందరెడ్డి అన్నారు. ఎన్టీఆర్ జిల్లా కల్కిచర్ల గ్రామంలో దళిత యువకుడిపై జరిగిన దాడిని ఖండిస్తూ, దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆదివారం బొమ్మలసత్రం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహనికి మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పూలమాల వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను ఖండించారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రం లో శాంతి భద్రతలకు చోటు లేకుండా పోయిందని విమర్శించారు. బొమ్మలసత్రంలో ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని నంద్యాలలోని ప్రధాన కూడలిలో పెట్టాలని దళిత నాయకులు, దళిత ప్రజా సంఘాలు నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిని ఎన్ని సార్లు ఆడిగినా, వినతి పత్రాలు ఇచ్చినా పట్టిచుకోవడం లేదన్నారు. 2024లో టిడిపి ప్రభుత్వం వచ్చిన తరువాత నంద్యాల ప్రధాన కూడలిలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ సామాజిక వర్గం నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్స్, వార్డ్ ఇంఛార్జిలు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులకు నిరసనగా టిడిపి నాయకులు నిరసన తెలియజేశారు. టిడిపి కౌన్సిలర్ హుస్సేన్ భాష, మాజీ జెడ్పిటిసి చాంద్ బాషా ఆధ్వర్యంలో పలువురు దళిత నాయకులు నాలుగు రోడ్ల కూడలి వద్ద అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. **బనగానపల్లె :** వైసీపీ పాలనలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని టిడిపి ఎస్సీ సెల్ నాయకులు తప్పెట ప్రసాద్, ఇల్లూరు కొత్తపేట బాలుడులు విమర్శించారు. పట్టణంలోని అవుకు మెట్ట వద్ద వైసిపి నాయకుల సామాజిక న్యాయ బస్సు యాత్రకు వ్యతిరేకంగా బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు అంబేద్కర్ విగ్రహం వద్ద టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు . నాయకులు యాగంటి పల్లె సుధాకర్, రవి , టిడిపి శ్రేణులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** దళితులపై దాడులు అరికట్టాలని టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జయ సూర్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద టిడిపి నాయకులు నిరసన చేపట్టారు. నాయకులు బండి జయరాజు, నాగముని, కౌన్సిలర్ భాస్కర్ రెడ్డి, ముర్తుజావలి, జమీల్, రసూల్, నిమ్మకాయల మోహన్, రాజు, బి.రాజన్న, కళాకార్, శాంతరాజు, అయ్యరాజు, ఏసేపు, శేఖర్, ప్రభు కుమార్, నాగరాజు, అప్సర్, రగడ, హుస్సేన్, వెంకటేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



బనగానపల్లెలో నిరసన చేపడుతున్న నాయకులు



ఆళ్లగడ్డలో



నందికొట్కూరులో..



శ్రీశైలంలో భక్తుల రద్దీ

ప్రజాశక్తి శ్రీశైలం

శ్రీశైల క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుండే గాక కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేసింది. స్వామి వారి స్పర్శ దర్శనంకోసం క్యూలైన్లోని భక్తులను, స్పర్శ దర్శనం టికెట్ కలిగిన క్యూ లైన్ భక్తులను విడతలవారీగా దర్శనానికి పంపించారు. క్యూలైన్లో వేచి ఉన్న భక్తులకు మంచినీరు, పాలు, బిస్కెట్లు అందజేశారు. అల్పాహారంలో సాంబారు అన్నం అందించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి అసౌక్యాలు కలగకుండా పర్యవేక్షించేందుకు పరిపాలనా భవనంలో పని చేసే సిబ్బందికి ప్రత్యేక డ్యూటీలు కేటాయించారు. భక్తుల రద్దీ అనుకూలంగా ప్రసాదాలను అందజేశారు. అన్నదాన మందిరంలో ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులకు అవసరమైన లడ్డు ప్రసాదాలు అందించేందుకు కౌంటర్లు ఏర్పాటు చేశారు. క్షేత్ర పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. క్షేత్రంలోని దుకాణాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి.

సర్వే బృందాలకు సహకరించండి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలోని గ్రామ పంచాయతీలలో జరుగుతున్న స్వామిత్వ సర్వేకు ప్రజలు సహకరించాలని జిల్లా పంచాయితీ అధికారి మంజులవాణి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. స్వామిత్వ సర్వే కోసం (అబాది) గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలోని గ్రామ కంఠం నందు గల ప్రభుత్వానికి సంబంధించిన ఆస్తులు, వ్యక్తి గత ఇళ్ళు, ఖాళీ స్థలాలు కొలతల నిమిత్తం గ్రామ పంచాయతీచే గ్రౌండ్ ట్రూతింగ్ నోటీసులు జారీ చేసిన సమయంలో సంబంధిత యజమానులు అందుబాటులో ఉండి వారికి ఆస్తి ధృవీకరణ పత్రాల నకళ్ళను అందజేసి సర్వే టీముకు సహకరించాలని కోరారు.

ఘనంగా నారీశక్తి సమ్మేళనం

ప్రజాశక్తి - నంద్యాల

అఖిల భారత మహిళా సమాఖ్య నిర్ణయంలో భాగంగా ఆదివారం స్థానిక సౌజన్య కన్వీన్షన్ హాల్‌లో ఘనంగా నారీ శక్తి సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య వక్తగా విజయభారతి హాజరై మాట్లాడారు. భారత దేశంలో మహిళలు శక్తి స్వరూపిణిలుగా నాటికి, నేటికి గుర్తింపబడుతున్నారని అన్నారు. ఏశ్చాత్య స్త్రీ వాదమే గొప్పదన్న భ్రమలో నుండి భారతీయ మహిళలు బయటకు రావాలని అన్నారు. ఈ సందర్భంగా పలు విద్యాసంస్థల విద్యార్థినిలు ప్రదర్శించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డాక్టర్ సత్యసుందరి, స్వర్ణలత, విజయ భారతి, మధుకుమారి, మురళి కళ్యాణి, శైలజ, సంధ్య, గాయత్రి, జ్యోతి, లీలావతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయ భారతి

11న విశ్వరూప మహాసభ

ప్రజాశక్తి - చాగలమర్రి

ఈ నెల 11న హైదరాబాదులో జరిగే మాదిగల విశ్వరూప మహాసభలను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వేణుగోపాల్ కోరారు. ఆదివారం చాగలమర్రిలోని కొత్త ఎస్సీ కాలనీలో ఇంటింటికి వెళ్లి విశ్వరూప మహాసభకు పార్టీలకు, కులాలకు అతీతంగా అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జోసెఫ్, బాల నరసింహులు, శేఖర్, చంద్ర,ప్రకాష్,రాజేష్, విజయబాబు, ప్రభాకర్, నరసింహ, ఆదినారాయణ, బాలయ్య, ఏసన్న, వెల్డింగ్ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతి - టిడిపి నాయకులు నివాళి

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు పట్టణంలోని మున్సిపాలిటీ 22వ వార్డులో ఎబిఎం పాలెం కాలనీకి చెందిన టిడిపి కార్యకర్త జల్తార్ రామాంజనేయులు భార్య యశోదమ్మ (30) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఈమెకు ఇద్దరు కుమార్తెలు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు బండి జయరాజ్ అక్కడికి చేరుకుని నివాళులర్పించారు. రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఎల్లప్పుడూ అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నిమ్మకాయల మోహన్, కళాఖర్, ప్రభు కుమార్, పగడం శేఖర్, పాలమర్రి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బహుజనులు చైతన్యమవ్వాలి : బిఎస్‌పి


ప్రజాశక్తి - నందికొట్కూరు

బహుజనులు చైతన్యమై బహుజన రాజ్యం తేవాలని బహుజన సమాజ్ వాది పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ అర్‌జే మల్లికల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లక్ష్మీనారాయణ కోరారు. ఆదివారం నందికొట్కూరు పట్టణంలో బహుజన సమాజ్ పార్టీ కార్యాలయాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో బిఎస్పీ నంద్యాల జిల్లా అధ్యక్షులు మహేంద్ర, జిల్లా ఇన్చార్జి గద్దల లాజర్, నందికొట్కూర్ అసెంబ్లీ ఇన్చార్జి ఎల్ స్వాములు, నందికొట్కూరు అధ్యక్షులు నాగన్న, నాయకులు వినయ్ మనోజ్, ఆది, శ్రీను, నాగేంద్ర, చరణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టినరోజు వేడుకల్లో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నందికొట్కూర్ టౌన్

ఓర్వకల్లు జీవేశ్వర దేవస్థాన ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన కొత్తపల్లె వైసిపి నాయకులు మల్లెల వెంకట శివారెడ్డి మనవరాలు దరవి రెడ్డి మొదటి పుట్టినరోజు వేడుకలలో నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు మాజీ సర్పంచ్ శ్రీనాథ్ రెడ్డి, దుద్యాల రఫీ, మాజీ జెడ్పిటిసి పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆర్థర్